ప్రజలు తాగునీటి జాగ్రత్తలు తీసుకోవాలి : కలెక్టర్

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలియచేశారు. వర్షపు నీరు కలిసిన బావి నీరు తాగవద్దని, భోజనం ముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు, కాయిల్స్ వాడాలని, గుంతలు, టైర్లు తదితర వాటిలో నీటినిల్వలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. జ్వరం, విరేచనాలు, వాంతులు, టైఫాయిడ్ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలన్నారు.

ఆంధ్రజ్యోతి

5

ANDHRAJYOTHY



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 30 అక్టోబరు 2025



కలువాయిలో దెబ్బతిన్న వరిపైరును చూపుతున్న అన్నదాత

ఆత్మకూరులో నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న అధికారులు

అనంతసాగరంలో...

మొంథా.. నష్టమెంత!?

తుఫాన్ దెబ్బకు తీవ్రంగా నష్టపోయిన రైతాంగం

పీఆర్‌లో 290 కి.మీ, ఆర్‌అండ్‌బీలో 462 కి.మీ రోడ్ల డ్యామేజీ

ఇరిగేషన్ శాఖకు రూ.300 కోట్ల నష్టం

ప్రాథమిక అంచనాలు తయారు చేసిన యంత్రాంగం

బాధితులకు చేయూత కార్యక్రమాలు ప్రారంభం

మొంథా తుఫాన్ దెబ్బకు జిల్లా అతలాకుతలమైంది. రికార్డు స్థాయిలో వర్షం కురవడంతో పంటలు, రోడ్లు, ఇళ్లు దెబ్బతిన్నాయి. బుధవారం వర్షం తెర పివ్వడంతో అధికార యంత్రాంగం నష్ట అంచనాలు వేసే పనిని మొదలుపెట్టింది. ప్రాథమికంగా నష్ట అంచనా వివరాలను అధికారులు ప్రభుత్వానికి పంపారు. ఒకటీ రెండు రోజుల్లో పూర్తిస్థాయి నష్టం ఎంతన్నది తెలుస్తుందని ఉన్నతాధికారులు తెలిపారు. అదే సమయంలో తుఫాన్ ప్రభావిత బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వం ఆదేశించిచంది. దీంతో పునరావాస కేంద్రాల్లోని బాధితులకు నిత్యావసర సరుకులతోపాటు నగదు అందించే పనిని యంత్రాంగం బుధవారం ప్రారంభించింది.

● రైతాంగానికి తీరని నష్టం

మొంథా.. జిల్లా రైతాంగానికి కోలుకోలేని నష్టాన్ని మిగిల్చింది. వ్యవసాయ శాఖ పరిధిలో 1320.73 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతినట్లు అధికారులు గుర్తించారు. అందులో 1282.63 హెక్టార్లలో వరి పంట దెబ్బతినగా, 21.7 హెక్టార్లలో మొక్కజొన్న, 11.4 హెక్టార్లలో వేరుశనగ పంట దెబ్బతిన్నది. 15 మండలాల్లోని 50 గ్రామాలకు చెందిన 1164 మంది రైతులు నష్టపోయారు. ఇక తుఫాన్ ప్రభావంతో 41.10 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కూరగాయల సాగు 19.56 హెక్టార్లు, పూల సాగు 3.40 హెక్టార్లు, బొప్పాయి సాగు 12.44 హెక్టార్లు, మిర్చి సాగు 3.70 హెక్టార్లు, తమలపాకు సాగు 2 హెక్టర్లలో దెబ్బతిన్నట్లు హార్టికల్చర్ అధికారులు గుర్తించారు. మొత్తం 13 మండలాల పరిధిలో 77 మంది రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు నివేదికలు రూపొందించారు. కాగా జిల్లాలో 31 పశువులు, 600 బాతులు చనిపోగా అందుకుగానూ రూ.9.345 లక్షలు నష్టం వాటిల్లింది. అలానే నాలుగు పశు వైద్యశాలలు కూడా దెబ్బతిన్నాయి. వీటికిగానూ రూ.2.30 కోట్ల నష్టం జరిగినట్లు పశుసంవర్థక శాఖ అధికారులు నివేదికలు తయారు చేశారు.




అల్లూరులో చెరువును తలపిస్తున్న పొలాలు



కలువాయిలో గింజలు మొలకెత్తి పచ్చగా ఉన్న పైరు

● బాధితులకు చేయూత

తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంతాల్లోని 2790 కుటుంబాలకు చెందిన సుమారు 7 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ బాధితులకు కుటుంబానికి 25 కేజీల బియ్యంతో పాటు కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, టమోటాలు కేజీ చొప్పున అందించాలని, అలానే ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు చొప్పున నగదు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. అలానే ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు మరో 13,512 మందిని గుర్తించారు. వీరిలో ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యంతోపాటు ఇతర నిత్యావసర సరుకులు ఇవ్వాలని ఆదేశాలు అందాయి. ఈ పంపిణీ ప్రక్రియ జిల్లాలో బుధవారం ప్రారంభమైంది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుధవారం బాధితులంతా పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో తొలి రోజు కొద్ది మందికి మాత్రమే ప్రభుత్వం సూచించిన సరుకులు అందించగలిగారు. గురువారం సాయంత్రానికి బాధితులందరికీ సరుకులు, నగదు అందజేయనున్నట్లు జిల్లా అధికారులు తెలియజేశారు. ఇక జిల్లాలో భారీ వర్షాలకు 16 ఇళ్లు దెబ్బతిన్నాయి. వీటికి పరిహారం నిర్ణయించాల్సి ఉంది.




కందుకూరు : ఉధృతంగా ప్రవహిస్తున్న మన్నేరు



ఏఎస్‌పేటలో నక్కలవాగు ఉధృతి



కందుకూరులో అలుగు వాగు



లింగసముద్రం : పెదపవని వద్ద ఉప్పుటేరు..

దెబ్బతిన్న రహదారులు

మొంథా తుఫాన్ దెబ్బకు జిల్లాలో చాలా రోడ్లు దెబ్బతిన్నాయి. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు వందల కిలోమీటర్ల పొడవున డ్యామేజీ అయినట్లు అధికారులు గుర్తించారు. వీటికి సంబంధించి ప్రాథమిక నష్ట అంచనాల నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 290 కిలోమీటర్ల మేర రోడ్ల సర్ఫేస్ డ్యామేజ్ జరిగింది. తాత్కాలికంగా ఈ రోడ్లను బాగు చేసేందుకు రూ.1.77 కోట్లు అవసరమని, వీటిని శాశ్వతంగా బాగు చేయాలంటే రూ.146.60 కోట్లు అవసరమని పీఆర్ ఇంజనీర్లు ఉన్నతాధికారులకు నివేదించారు. అలానే కావలి, కొండాపురం మండలాల్లో రెండు చోట్ల పంచాయతీరాజ్ రోడ్లు తెగిపోయాయి. ఇక ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో 462 కి.మీ మేర రోడ్ సర్ఫేస్ డ్యామేజీ జరిగింది. గండవరం, కరేడు రెండు చోట్ల రోడ్లు బ్రీచ్ అయ్యాయి. ఈ డ్యామేజీకి తాత్కాలిక మరమ్మతులకు రూ. 22.87 కోట్లు, అదే శాశ్వత నిర్మాణాలకైతే రూ.164 కోట్లు అవసరమవుతాయని ఆర్అండ్‌బీ అధికారులు నివేదించా రు. జిల్లాలో 31 ఆర్అండ్‌బీ రోడ్లపై వరద నీరు పారుతుం డగా, అందులో 16 ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కాగా భారీ వర్షాల ప్రభావంతో ఇరిగేషన్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. చాలా చోట్ల చెరువు కట్టలు బలహీనపడ్డాయి. కాలువలు పూడికతో నిండిపోగా, ఉధృతంగా ప్రవహిస్తున్న వరదలకు డ్రెయిన్లు దెబ్బతిన్నాయి. ఒక్క మంగళవారం నాడే 815 చోట్ల దెబ్బతిన్నాయి. ఈ డ్యామేజస్‌కు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు రూ.65 కోట్లు అవసరమని, శాశ్వత నిర్మాణాలు చేసేందుకు సుమారు రూ.300 కోట్లు అవసరమవుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు.



సంగం బస్టాండు వద్ద దెబ్బతిన్న రోడ్డు

● యంత్రాంగం సేవలు భేష్

మొంథా ప్రభావం జిల్లాపై తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటి నుంచి జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అవసరమైన ముందస్తు చర్యలను చేపట్టింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రతి మండలానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. అలానే అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు సెలవులు రద్దు చేసి వారంతా హెడ్‌క్వార్టర్స్‌లో ఉండేలా ఆదేశాలిచ్చారు. రెవెన్యూ, పోలీసులు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాయి. అలానే పెన్నా పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వచ్చాయి. భారీ వర్షాలు కురిసినా విద్యుత్ శాఖ పని తీరుతో ఎక్కడా విద్యుత్ సమస్య తలెత్తలేదు. ప్రధానంగా నెల్లూరులో రోడ్లపై వర్షపు నీరు పారకుండా మున్సిపల్ అధికారులు వేగంగా చర్యలు తీసుకున్నారు. అలానే గ్రామాల్లో కూడా నీరు నిలబడకుండా ఎంపీడీవోలు చర్యలు తీసుకున్నారు. ఇక కీలకమైన ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు కూడా ఎక్కడా ఒక్క చెరువు కట్ట తెగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడికక్కడ కాలువల్లో పూడిక, గుర్రపు డెక్కలను తొలగిస్తూ వరద ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేయడంతో ప్రమాదాలు తప్పాయి. మిగిలిన శాఖలు కూడా వారి వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంతో తీవ్ర తుఫాన్‌ను జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కోగలిగింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



కలువాయి : వెంకటరెడ్డిపల్లి వద్ద రోడ్డుపై కుల్లూరు చెరువు కలుజు నీరు



కొట్టుకుపోయిన రాపూరు-పంగిలిరోడ్డు

కలువాయిని చుట్టేసిన నీరు

కలువాయి : మండలంలోని కుల్లూరు, వెంకటరెడ్డిపల్లిలో సుమారు 480 ఎకరాలు కోతకు వచ్చిన వరి పైరు నీట మునిగిపోయింది. నీటిలో ఉన్న గింజలు మొలకెత్తి పచ్చగా పైరు తయారైంది. పంటంతా నీటిపాలు కావడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. ఎకరాకు రూ.20వేలు పెట్టుబడి పెట్టామని, అదంతా నష్టపోయినట్లు వాపోతున్నారు. అలాగే మండలంలోని పలు చెరువులు నిండి కలుజు పారుతుండగా, ఆ నీటిని తీసుకుపోయే వాగులు పొంగి చుట్టు పక్కల పొలాలను ముంచెత్తాయి. కుల్లూరు చెరువు కలుజు నీరు పొలాలను ముంచి వెంకటరెడ్డిపల్లి సమీపంలో సోమశిల-పొదలకూరు మెయిన్ రోడ్డుపై ప్రవహిస్తోంది. కలువాయి చెరువు తూర్పు, పరమటి అలుగులు ద్వారా వస్తున్న నీటితో పొలాలన్నీ చెరువుల్లా మారిపోయాయి. రాజుపాళెం- సోమశిల మార్గంలో మంగళవారం రాత్రి చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



సంగంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



కావలిలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



కందుకూరులో ట్రాక్టరుపై వెళ్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

బీరాపేరులో కొట్టుకొచ్చిన డ్రెడ్జింగ్ పడవలు

● సంగం బ్యారేజీకి తప్పిన పెనుముప్పు



పాత కనిగిరి కాలువ రెగ్యులేటర్లకు సమీపంలో ఆగిన మరో రెండు పడవలు

సంగం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంగం బ్యారేజీ ఎగువ ప్రాంతంలో ఇసుక తీసేందుకు కాంట్రాక్టర్లు తీసుకొచ్చిన భారీ డ్రెడ్జింగ్ పడవలు బుధవారం తెల్లవారుజామున బీరాపేరు వరద ప్రవాహానికి కొట్టుకు వచ్చాయి. పాత ఆనకట్ట క్రస్ట్‌కు ఢీకొని ఓ పడవ ఆగిపోగా, మరో రెండు పడవలు పాత కనిగిరి కాలువ హెడ్‌రెగ్యులేటర్లకు సమీపంలో నిలిచిపోయాయి. పాత ఆనకట్ట వద్ద పడవ ఆగకపోయి ఉంటే సుమారు 86 వేల క్యూసెక్కుల నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న బీరాపేరు ప్రవాహానికి పడవ నేరుగా కొత్త బ్యారేజీని ఢీకొని ఉండేది. దీనివల్ల అపార నష్టంవాటిల్లి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల మధ్యాహ్నం హుటాహుటిన బ్యారేజీ వద్దకు చేరుకుని కొట్టుకు వచ్చిన పడవలను పరిశీలించారు.

● తొలిగింపునకు విశ్వప్రయత్నాలు

క్రస్ట్ వద్ద ఆగిన పడవ ప్రమాదకరంగా ఉండడంతో బయటకు తీసుకు వచ్చేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, మత్స్య శాఖ, అగ్నిమాపక అధికారులతోపాటు సిబ్బందిని పిలిపించారు. నీటి ప్రవాహం తగ్గేవరకు బయటకు తీసేందుకు వీలుపడలేదు. బ్యారేజ్‌ను పడవ ఢీకొట్టకుండా అక్కడే స్థిరంగా ఉండేలా ఎన్డీఆర్ఎఫ్ బృందంతో ప్రయత్నిస్తున్నారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో సాయంత్రం వరకు కనీసం పడవ ఉన్న ప్రాంతానికి వెళ్లడానికి కూడా వీలుపడలేదు. ఆత్మకూరు ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, మత్స్యశాఖ జేడీ శాంతి, అగ్నిమాపక, తెలుగు గంగా ఇన్‌చార్జి ఎస్ఈ రాధాకృష్ణ, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఈఈ అనీల్ కుమార్, సంగం, ఆత్మకూరు సీఐలు ఘటనాస్థలిలో ఉన్నారు.



అల్లూరులో కూలిన విద్యుత్ స్తంభాలు



జలదంకి : పెద్దచెరువు అలుగు పారుతుండటంతో ఆగిన రాకపోకలు



ఉదయగిరి ఇంటిపై కూలిన స్తంభం



అనంతసాగరం మండలం సోమశిలలో వాలిన రామాలయం ముందున్న ధ్వజస్తంభం

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరుగుతోంది. మంగళవారం 41 వేల క్యూసెక్కులు వస్తుండగా బుధవారం సాయంత్రానికి 48,330 క్యూసెక్కులకు పెరిగింది. గేట్ల ద్వారా 23,460 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాంలో 68.453 టీఎంసీల నీరు నిల్వ ఉంచారు.

● **లింగసముద్రం :** రాళ్లపాడు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గడంతో అధికారులు గేట్లను దించేశారు. బుధవారం ఉదయం 7 గంటలకు నాలుగు గేట్లను దించి మన్నేరుకు నీటి విడుదలను ఆపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి కేవలం 800 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు డీఈ ఎం వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రాజెక్టులో 19 అడుగల నీటిమట్టం ఉంది.



వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఇటుక అందిస్తున్న చిన్న జీయర్ స్వామి, చిత్రంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, నుడా చైర్మన్ కోటంరెడ్డి

ఆలయాలు జాతి వైభవానికి చిహ్నాలు

- తెలుగు జాతిది 2వేల సంవత్సరాల చరిత్ర
- త్రిదండి రామానుజ చిన్న జీయర్
- నెల్లూరులో వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన
- గడువుకన్నా ముందే ఆలయ నిర్మాణం : దేవదాయ శాఖ ముఖ్యకార్యదర్శి
- హాజరైన దేవదాయ శాఖ మంత్రి ఆనం

8

నేడే జడ్పీ సమావేశం

● వాయిదాకు అవకాశం

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం (నేడు) నిర్వహించనున్నారు. అయితే సమావేశం వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జడ్పీ సమావేశం చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించనున్నారు. ఇందుకుగానూ అజెండాను ఈనెల 16న రూపొందించి, నేడు సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఐదు అంశాలతో అజెండాను రూపొందించారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, సాంఘిక సంక్షేమశాఖ, రోడ్లు భవనాల శాఖలపై సమావేశంలో చర్చించాలని అజెండాలో పొందుపరిచారు. ఈ అజెండాపై సమావేశంలో సభ్యులు చర్చించాల్సి ఉంది. అయితే సమావేశం వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాను మొంథా తుఫాన్ అతలాకుతలం చేయడంతో అధికార యంత్రాంగం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులంతా సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. తుఫాన్ తాకిడి తగ్గినా జిల్లాలో అనేక ప్రాంతాలు ముంపులో ఉండడం, పంట, ఇతర నష్టాలు అధికంగా ఉండడంతో అధికార యంత్రాంగం పూర్తిగా సహాయక చర్యలో ఉంటున్నారు. దీంతో అధికారులు సమావేశానికి వచ్చే అవకాశాలు లేవు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని జడ్పీ సమావేశాన్ని వాయిదా వేసే అవకాశాలు ఉన్నాయి.



మల్లికార్జున స్వామికి కోటి సోమవార అభిషేకాలు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ కామాక్షి తాయి ఆలయంలో బుధవారం కోటి సోమవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. మల్లికార్జున స్వామికి ఉదయం, ప్రదోష కాలాల్లో రుద్రాభిషేకాలు, విశేష పూజలు చేశారు. అమ్మవారికి నవావరణ పూజ, కుంకుమార్చన జరిగాయి. భక్తులు ఉపవాస దీక్ష చేపట్టి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారికి నేత్రపర్వంగా పల్లకీసేవ జరిగింది.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11619
వెండి కిలో ధర	రూ. 151800
వెండి ఒక గ్రాము	రూ. 157.80

ఎక్సైజ్ స్టేషన్‌లో 3న ద్విచక్ర వాహనాల వేలం

ఇందుకూరుపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట ప్రొబిషన్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాలుగు ద్విచక్ర వాహనాలను నవంబరు 3వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదల్చినవారు రూ. వెయ్యి ధరావత్తు సొమ్ము చెల్లించి ఒరిజినల్ ఆధార్‌కార్డు, పాన్‌కార్డులను తీసుకుని వచ్చి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ

వెంకటాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీలోని జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) విభాగం ఆధ్వర్యంలో యాచకులు, అనాథలు, వృద్ధులు, నిరాశ్రయులకు మంగళవారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారికి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీ వెంకటసుబ్బారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పెన్నా పొర్లుకట్టకు భద్రత ఏదీ?

- వరద ప్రవాహంతో తరచూ కోతకు గురి
- మట్టి తరలింపు, దారుల ఏర్పాటుతో కోల్పోతున్న పటిష్ఠత
- దృష్టిసారించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెన్నానది పొర్లుకట్టకు భద్రత కరువైంది. ఓ పక్క వర్షాకాలంలో వరద ప్రవాహంతో కోతకు గురవుతుండగా మరోపక్క అక్రమార్కులు యథేచ్ఛగా పొర్లుకట్టను తవ్వి అక్రమంగా మట్టి తరిస్తుండడంతోపాటు పలు చోట్ల రైతులు వాహనాలు వెళ్లేందుకు దారులు ఏర్పాటు చేసుకొంటుండడంతో పొర్లుకట్ట పటిష్ఠతను కోల్పోయి భద్రత ప్రమాదకరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంత గ్రామాల్లో భయాందోళనలు నెలకొంటున్నాయి. పెన్నా నది ప్రవాహం ఎక్కువగా ఉత్తరం వైపునే ఉంటుంది. జొన్నవాడ పరిసర ప్రాంతం నుంచి విడవలూరు మండల పరిధిలోని ఊటుకూరు వరకు పెన్నానది పరివాహక ప్రాంతంలో పెన్నభూమిలో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. రవాణా సదుపాయం కోసం పలుచోట్ల పొర్లుకట్టను ధ్వంసం చేసి మార్గాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో పొర్లుకట్ట మట్టి పలుచోట్ల నీటిలో కలిసిపోతోంది. పోతిరెడ్డిపాళెం సమీపంలో పొర్లుకట్ట మట్టిని ఐదేళ్ల కిందట తరలించారు. దీంతో మూడేళ్ల కిందట కోవూరు పరిసర ప్రాంతాన్ని వరదలు ముంచెత్తాయి. ఇటీవల 15 రోజులుగా కురుస్తోన్న వర్షాలకు పెన్నానదికి భారీ ప్రవాహం వచ్చింది. మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తోన్న భారీ వర్షాలకు పెన్నానదీ ప్రవాహం పొర్లుకట్ట వద్దకు చేరుకుంది.



పోతిరెడ్డిపాళెం సమీపంలో కోతకు గురైన పెన్నా పొర్లుకట్ట

● పొర్లుకట్టలు పటిష్ఠ పరచాలి

ఇప్పుడు పెన్నానది నిండు కుండలా మారింది. వరద ప్రవాహం సంభవిస్తే ఉన్న పొర్లుకట్ట దెబ్బతినే పరిస్థితి తలెత్తింది. వర్షాకాలంలో ముఖ్యంగా పెన్నానదికి వరదవచ్చిన సమయంలోనే పొర్లుకట్టల గురించి అధికారులు చర్చిస్తారు. తరువాత కాలంలో మరచిపోతుంటారు. ఈ క్రమంలో పటిష్ఠమైన పొర్లుకట్టలు పెన్నానది వెంబడి నిర్మించాల్సిందిగా పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

బుచ్చిరెడ్డిపాళెం మండలపరిధిలోని జొన్నవాడ, కోవూరు మండల పరిధిలోని పోతిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట మండల పరిధిలోని ముదివర్తిపాళెం సమీపంలోని పెన్నానది పొర్లుకట్టలను ఇటీవల కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు. పెన్నా పొర్లుకట్టల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. త్వరలోనే పొర్లుకట్టల పటిష్ఠత విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తామని ఆ సందర్భంగా ఆమె ప్రకటించారు.

వరదలొస్తే అతలాకుతలమే...

పెన్నానదికి వరద వస్తే బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, విడవలూరు మండలాల ప్రజానీకమే కాకుండా నెల్లూరు నగరంలోని పౌరులు కూడా అతలాకుతలమతారు. పెన్నానది పొంగి ప్రవహించి పోతిరెడ్డిపాళెం, పడుగుపాడు, ఇనమడుగు, లేగుంటపాడు, వేగూరు, ముదివర్తి, విడవలూరు, ఊటుకూరు గ్రామాల్లోకి వరదనీరు పోటెత్తిన ఘటనలెన్నో ఉన్నాయి. వరదనీరు వచ్చిన సమయంలో సహాయక కార్యక్రమాల్ని చేపట్టిన నాయకులు, అధికారులు పెన్నానది పొర్లుకట్ట భద్రత గురించి పట్టించుకోలేక పోవడం గమనార్హం.

లోతట్టు ప్రాంతాల జలమయం

● ఎమ్మెల్యే సొంత నిధులతో సహాయక చర్యలు



విడవలూరు : ముంపు గ్రామాల వారితో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుకు బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇప్పటికే కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సొంత నిధులతో గుడపల్లి తదితర కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. పట్టణంలోని కాశీపాళెం, పల్లాపల్లి వడ్డిపాళెం, మినగల్లు గ్రామాల్లో మగ్గం గుంటల్లోకి నీరు చేరి చేనేత కార్మికులకు నష్టం వాటిల్లింది. పలు రోడ్లు దెబ్బతిన్నాయి. దామరమడుగులోని గుంటకట్ట ప్రాంతంలో వీధులు జలమయం కావడంతోపాటు కొన్ని ఇళ్లలోకి నీరు చేరింది. స్థానికుల సమాచారంతో స్పందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఆ ప్రాంతంలోని మసీదు దగ్గర్నుంచి పెన్నా పొర్లుకట్ట కాలువ వరకు పంట కాలువలో ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీయించారు. దీంతో గుంటకట్ట ప్రాంతంలో నీరు తగ్గుముఖం పట్టిందని టీడీపీ రూరల్ అధ్యక్షుడు బెజవాడ జగదీష్ తెలిపారు. పల్లిపాళెంలోని పంట కాలువ, ఆర్‌ఆర్ నగర్ కాలనీ ప్రాంతాల్లోని పలు పంట కాలువల్లోనూ పూడికతీయించి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటి ఇబ్బందులు తొలగించనున్నట్లు ఆయన తెలిపారు. పూడికతీత పనులను టీడీపీ మైనారిటీ నాయకులు రియాజ్, గయాజ్, ముజఫర్, బద్రుద్దీన్, డాక్టర్ అర్జున్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

● పొదలకూరులో జలమయం

పొదలకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో పొదలకూరు పట్టణంలోని శివాలయం వీధిలోని ఏర్పడిన ముంపును బుధవారం ఎంపీడీవో నరసింహారావు, హౌసింగ్ డీఈ ఎండీ .జహిరుద్దీన్ అహ్మద్, హౌసింగ్ ఏఈ మహేష్ పరిశీలించారు. ఒకే గుడిసెలో ఐదు కుటుంబాలు నివాసం ఉంటున్న విషయాన్ని టీడీపీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థలం ఉంటే ఇళ్ల నిర్మించే అవకాశం కల్పిస్తామని అధికారులు తెలపడంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం : ప్రశాంతిరెడ్డి

విడవలూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుపాను కారణంగా నీరాశ్రయులైన వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న పార్లపల్లి, గాదెలదిన్నె కాలనీవాసులను బుధవారం ఆమె పరామర్శించారు. కాలనీల్లో ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ముంపు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు నియోజవర్గంలో జరగలేదన్నారు. మండలంలోని చౌకిచర్ల, గాదెలదిన్నె ప్రాంతాల్లో పైడేరు డ్రైయిన్ కట్టలకు గండి పడడంతో పంట పొలాల్లో నీరు చేరిందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించి కరకట్టకు మరమ్మతులు చేపడతామన్నారు. వర్షాలకు దెబ్బతిన్న, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ప్రభుత్వం కొత్త ఇళ్ల మంజూరు చేస్తుందన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు రూ.3వేలు, 25 కేజీల బియ్యంతోపాటు నిత్యావసర వస్తువులను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. తుపాను సమయంలో అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, టీడీపీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, మండలాధ్య క్షుడు ఏటూరు హరిరెడ్డి, నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతాబాల కృష్ణ, వెల్లంపల్లి దీలిప్, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో డీఎంహెచ్‌వో తనిఖీ

ఇందుకూరుపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలోని లేబూరు బిట్-1లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత పరిశీలించారు. శిబిరంలో ఉన్న వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. తుఫాన్ అనంతరం సీజనల్ వ్యాధులు, నీటి సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ప్రజలకు అవగాహన కల్పిస్తూ అత్యవసర ఆరోగ్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం జగదేవిపేట పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు వరిగొండ సుమతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ కిషోర్‌కుమార్, హెచ్‌ఈ వో శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ గురుబ్రహ్మం, సీసీలు సందీప్, రామకృష్ణారెడ్డి, సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు పాల్గొన్నారు.

నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలి

పొదలకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా పొదలకూరు మండలం తోడేరు వీవర్స్ కాలనీలో మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. దీంతో చేనేత కార్మికులు జీవనోపాధిని కోల్పోయారు. సర్వేపల్లి వైసీపీ చేనేత విభాగం అధ్యక్షుడు పముజుల శంకరయ్య బుధవారం చేనేత కార్మికులను కలిసి మగ్గాలను పరిశీలించారు. 15రోజులుగా పనిలేక ఆకలితో అలమటిస్తున్న చేనేత కుటుంబాలకు తక్షణమే ప్రభుత్వం రూ.15వేల చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

తుఫాన్ బాధితులకు ఎస్‌ఈఐఎల్ ఎనర్జీస్ చేయూత

ముత్తుకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుపాను బాధితులకు పైనంపురంలోని ఎస్‌ఈఐఎల్ ఎనర్జీస్ థర్మల్ కేంద్రం అండగా నిలిచింది. తుపాను సమయంలో పైనంపురంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బుధవారం బాధితులకు భోజనం అందజేశారు. తహసీల్దారు స్వప్న సూచనల మేరకు యాజమాన్యం తుపాను బాధితులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావలి విజయ్‌కుమార్, ఎస్‌ఈఐఎల్ సీఎస్‌ఆర్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు భోజన ప్యాకెట్ల పంపిణీ

వెంకటాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసుమూరులో తుఫాన్ పునరావాస కేంద్రంలో బుధవారం ఎస్సీ, ఎస్టీలకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు దుప్పట్లను కూడా అందజేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య సేవలను అందించారు. అలాగే ఇస్కపాళెం, తాటిపర్తిపాళెం గ్రామాల్లో కూడా స్థానిక టీడీపీ నేతలు దుప్పట్లు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చవటపాళెం సొసైటీ చైర్మన్ రావూరి రాధాకృష్ణమ నాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కల్పన, సీఐ సుబ్బారావు, నేతలు లఘుంసాని వెంకయ్య, బుర్ర శ్రీను, చికూర్తి ప్రసాద్, షేక్ అన్వర్, ప్రభాకర్‌నాయుడు, వెంకటరమణయ్య, ఏడుకొండలు, పెంచలయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.


జగనన్న కాలనీలో పర్యటించిన కాకాణి పూజిత

వెంకటాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని జగనన్న కాలనీలో బుధవారం సాయంత్రం వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కాకాణి పూజిత పర్యటించారు. వర్షాలతో కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. బ్రెడ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఆమె వెంట వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పొదలకూరు బూత్ కమిటీ మండల కన్వీనర్ బత్తల సురేష్‌కుమార్‌రెడ్డి, నేతలు మందల పెంచలయ్య, అశోక్, నరేష్ నాయుడు, గోపాల్, మనోజ్ పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు, స్తంభాలు

రాపూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావం వలన మండలంలోని పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మంగళవారం వీచిన ఈదురుగాలులకు పాత పెంచలకోన రోడ్డులో భారీ వృక్షం నేలకొరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మల్లమ్మగుంటలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొండేరు వాగు ఉధృతికి పంగిలిరోడ్డు కొట్టుకుపోవడం వలన పంగిలి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. నిమ్మచెట్లు నేలవాలాయి.

వర్షాలకు పొంగిన వాగులు



మనుబోలు రహదారిపై పారుతున్న కండలేరు వాగు

మనుబోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వలన మూడురోజుల పాటు కురిసిన వర్షాలకు మండలంలోని అన్ని వాగులు పొంగి ప్రవహించాయి. దీంతో రహదారులన్నీ జలమయం కావడంతో పలు గ్రామాలకు దారులు మూసుకుపోయాయి. మంగళవారం అర్ధరాత్రి కండలేరు వాగు పొంగడంతో మనుబోలు రహదారిపై నీరురావడంతో రాకపోకలు నిలిపివేశారు. అలాగే తీరప్రాంత గ్రామాలకు వెళ్లే రహదారిపై నీరు రావడంతో వెంకన్నపాళెం, బద్దెవోలు, పిడూరుపాళెం, కట్టువపల్లి, కొలనుకుదురు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. అలాగే పిడూరు చెరువు పొంగడంతో సర్వీసురోడ్డు మునిగిపోయింది. దీంతో ఆ గ్రామానికి మనుబోలు నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కొమ్మలపూడి రైల్వే వంతెన కింద పొట్టేళ్ళ కాలువ జోరుగా పారుతోంది. దీంతో ఆ మార్గంలో కొమ్మలపూడి, ముద్దమూడి, చెరుకుమూడి గ్రామాలకు వెళ్ళడానికి వీలులేకుండా పోయింది. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి బుధవారం స్థానిక టీడీపీ, జనసేన నాయకులు అల్పాహారం, బోజనం పెట్టారు. వారిని అధికారులు సురక్షితంగా ఇళ్లకు చేర్చారు. పొంగి ప్రవహిస్తున్న వాగులను డీటి ప్రదీప్, ఎంపీడీవో జలజాక్షి, ఇతర అధికారులు పరిశీలించి వాగుల వద్దకు ఎవరు వెళ్ళకుండా ముళ్ళకంపలు వేయించారు. పూర్తిగా రహదారులపై నీరు తగ్గిన తరువాతే రాకపోకలు సాగించాలని ప్రజలను కోరారు.

నావి కోడికాళ్లయితే.. మరి నీవి ఏ కాళ్లు!?

- కాకాణిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్



వావింటపర్తి పైడేరు వాగు వద్ద ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : 'నావి కోడికాళ్లు అయితే మరి నీవి ఏ కాళ్లు.' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఉద్దేశించి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వావింటపర్తి, పైడేరు వాగును పరిశీలించి, గిరిజనులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ పర్వతాపురం, పులికల్లు, అంకుపల్లి, వావింటపర్తి, ఊచపల్లి వాసులకు ఇబ్బందిలేకుండా ఆరు ప్రొక్లెయిన్లు పెట్టి పనులు చేయించామన్నారు. స్పిల్ వే నుంచి డేగపూడి వరకు వరద ప్రవాహం సాఫీగా సాగిపోయేలా రూ.95 కోట్ల అంచనాతో అధికారులు ప్రతిపాదనలు పెట్టామన్నారు. 'కౌబాయ్ వేషంలో ఒకాయన సర్వేపల్లి నియోజకవర్గంలో తిరుగుతున్నారు. నేను ప్రజల సొత్తు అక్రమంగా తిని ఆయనలా అడ్డంగా బలవలేదు. సన్నగా ఉన్నా.. గాలి కొడితే ఎగిరిపోతానేమో కాకాణి కాళ్లు ఎలా ఉంటాయో ప్రజలందరికీ తెలుసు. నేల మీద నుంచి రెండు అడుగులు ఉండే ఓ నల్ల జంతువు కాళ్లలా ఉంటాయని అందరూ చెబుతుంటారు. నిద్రలేచినప్పటి నుంచి నాకు, నా కొడుక్కి వందల కోట్లు అని ఏడుస్తున్నాడు. ఆ వందల కోట్లు ఎక్కడ పెట్టాలో అర్థం కావడంలేదు... కరోనా హౌస్ అయినా బాడుగకు ఇస్తే అక్కడైనా పెడతా'నని అన్నారు. 204 రోజులు కనిపించకుండా పోయి వచ్చిన తర్వాత అయినా ఆయనలో మార్పు రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్‌బాబు, నెట్టం పెంచల నాయుడు, వెంకటరత్నం నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, కోడూరు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల చెట్ల తొలగింపు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్ వద్ద ముంబై రోడ్డు కలుజుల ప్రాంతంలో అరణ్యాన్ని తలపిస్తున్న ముళ్ల చెట్ల తొలగింపు పనులు బుధవారం చేపట్టారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బత్తల హరికృష్ణ ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి రిజర్వాయర్ వద్ద ముళ్ల చెట్లను తొలగింపునకు చర్యలు చేపట్టారు. దీంతో రైతులు, ఇరిగేషన్ అధికారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీపీపీ విధానం ఉపసంహరించుకోవాలి

మనుబోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పీపీపీ విధానం ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కాకాణి బుధవారం మనుబోలులో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఎంపీటీ సభ్యురాలు దువ్వూరు రాజేశ్వరి, సర్పంచు కంచి పద్మమ్మ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే పొదలకూరు మండలం నావూరు పెద్దవాగును బుధవారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైసీపీ నాయకులతో కలిసి పరిశీలించారు.

కాకాణికి కలలో కూడా సోమిరెడ్డే కనిపిస్తున్నాడు : తలచీరు

పొదలకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాకాణికి కలలో కూడా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి కనిపిస్తున్నాడని 2029లోనూ ఓటమి తప్పదనే భయం ఆయనను వెంటాడుతోందని పొదలకూరు పీఎసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, గంటా మల్లిఖార్జున్‌యాదవ్, అలుపూరు శ్రీనివాసులుతో కలిసి విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తలచీరు మస్తాన్‌బాబు మాట్లాడుతూ పొదలకూరు మండలంలో రోడ్లు వేసినా, కాలువల పనులు జరిగినా, సోమశిల నీళ్ల తెచ్చినా, ఎత్తిపోతల పథకం వచ్చినా, ఆసుపత్రులు కట్టినా సోమిరెడ్డి పుణ్యమేనన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని దూషించడం కాదు.. ఆయన చేపట్టిన అభివృద్ధి పనులను చూసి కనువిప్పు కలిగించుకోవాలన్నారు.

పలువురికి పోలంరెడ్డి పరామర్శ

బుచ్చిరెడ్డిపాళెం/కొడవలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆయన కుమారుడు ఏపీఈఎంసీఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు మండలాల్లో పలువురిని పరామర్శించారు. బుచ్చిమండలంలోని సాల్మానుపురం గ్రామానికి చెందిన సీనియర్ నేత మల్లు రఘురామిరెడ్డి ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని పోలంరెడ్డి పరామర్శించారు. అలాగే, కొడవలూరు మండలంలోని నార్త్ రాజుపాలెంలో కొండా బలరామిరెడ్డి భార్య కొండా భారతమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆమె అంత్యక్రియల్లో పోలంరెడ్డి పాల్గొన్నారు. వీరి వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

వెంకటాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చవటపాళెం సొసైటీ చైర్మన్ రావూరి రాధాకృష్ణమ నాయుడు తెలిపారు. మండలంలోని ఈదగాలి రైతుసేవా కేంద్రంలో బుధవారం రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. యూరియా కార్డులు కూడా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ ఆస్తోటి నాగరాజు, ఎంపీడీఓ కల్పన, అగ్రికల్చర్ ఏఓ హరికరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

CRIME NEWS

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మృతులు యూపీ వాసులు



అనంతసాగరం అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మణం చెందిన సంఘటన అనంతసాగరం మండలం ఉప్పలపాడు వద్ద 565 జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు కడప జిల్లా ప్రొద్దుటూరులో స్వీట్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. కాగా, పెళ్లివేడు కలకు రాపూరు మండలంలోని పెంచలకోన పుణ్యక్షేత్రంకు బుధ వారం రాత్రి మూడు కార్లలో బంధువులు, మిత్రులు బయలుదేరారు. అందులోని ఓ కారు ఉప్పలపాడు కూడలి సమీపంలో రోడ్డు కుడివైపు నిలిపి ఉన్న వరికోత యంత్రం లారీని ఢీకొంది. దీంతో కారులోని ఏడుగురిలో సయ్యద్ ఆసీఫ్ (20), బాషా (50) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు నయిమ్, అషరఫ్, కరన్‌పాల్, ఆదిల్‌పాల్, జబీవుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సోమశిల, అనంతసాగరం పోలీసులు సంఘటనా స్థలికి చేంపకొని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన ఐదుగురిని అనంతసాగరం, మర్రిపాడు 108 వాహనాల ద్వారా ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేగూరు కాలువలో మృతదేహం

కోవూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పడుగుపాడు మజరా లక్ష్మీనారాయణపురం సమీపంలోని వేగూరు కాలువలో బుధవారం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి 45 సంవత్సరాలు ఉంటుందని, 5.7 అడుగుల ఎత్తు, బట్ట తల ఆనవాళ్ళు కలిగిన ఆయన ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి ప్యాంటు జేబులో మూడు రకాల మాత్రలను కనుగొన్నారు. పడుగుపాడు వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాగులో గల్లంతైన వృద్ధురాలి మృతదేహం లభ్యం



జయమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మనుబోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పొట్టేళ్ళ వాగులో గల్లంతైన గొట్లపాళెం గ్రామానికి చెందిన కిష్టమనేని జయమ్మ (67) మృతదేహాన్ని బుధవారం వెలికి తీశారు. సమాచారం అందిన వెంటనే పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ. శివరాకేష్ వాగు వద్దకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని పిలిపించారు. మంగళవారం రాత్రంతా గాలించినా జయమ్మ ఆచూకీ కానరాలేదు. బుధవారం వేకువన మరోమారు గాలించగా, వాగుకు పదిమీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. వాగులోంచి మృతదేహాన్ని రెస్క్యూ టీం బయటకు తీసుకువచ్చింది. జయమ్మ మృతదేహాన్ని చూసిన వెంట నే బంధువులు బోరున విలపించారు. శవపరీక్షల నిమిత్తం మృత దేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

కావలి రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గురునాథం ఏడుకొండలు(49) మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం కావలి పట్టణం కళుగోళ శాంభవి ఆలయం సమీపంలో జరిగింది. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. ఎగువమార్గంలో న్యూటిన్ సుకియా నుంచి తాంబరం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతి చెందాడు. లోకో పైలెట్ సమాచారం మేరకు ఎస్ఐ వెంకట్రావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మృతుడి వద్ద లభించిన ఆధారాల మేరకు పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ సమీపంలో ఉంటున్న ఏడుకొండలుగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు...

మనుబోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ తిరుమలశెట్టి మస్తానయ్య (62) అనే గిరిజన వృద్ధుడు బుధవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక మద్యం దుకాణంలో మస్తానయ్య కొంత కాలంగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 7వ తేదీన పనుల నిమిత్తం కేఆర్‌పురం నుంచి ఇంటికి వెళ్ళేందుకు జాతీయరహదారి దాటుతుండగా నెల్లూరు నుంచి గూడూరు వెళుతున్న కారు మస్తానయ్యను ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన మస్తానయ్యను చికిత్స నిమిత్తం గూడూరు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాలలోని వైద్యశాలలకు పంపి చికిత్సలు అందించారు. ఈనెల 17న ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకున్న మస్తానయ్య ఇంటివద్ద చికిత్స తీసుకుంటున్న క్రమంలో బుధవారం తెల్లవారుజామున చనిపోయాడు. దీంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హైవేపై భారీ వాహనాల నిలుపుదల

వెంకటాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై మొంథా తుఫాన్ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా భారీ కంటైనర్లు, వాహనాలను పోలీసులు నిలుపుదల చేశారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు తుఫాన్ తీరం దాటే సమయంలో భారీగా గాలులు వీచే అవకాశాలు ఉన్నందున ఎస్పీ డాక్టర్ అజిత సూచనల మేరకు పోలీసులు వాహనాలను నిలుపుదల చేసి ఆ తర్వాత సురక్షితంగా పంపారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు రూరల్, కావలి డీఎస్పీలు గట్టమనేని శ్రీనివాసరావు, శ్రీధర్, వెంకటాచలం సీఐ సుబ్బారావు తదితరులు పర్యవేక్షించారు.

మద్యం మత్తులో బైక్‌తో వీరంగం

- నలుగురికి గాయాలు

ఉదయగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ఓ వ్యక్తి బుధవారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో మోటార్ బైక్‌తో వీరంగం సృష్టించడంతో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన సోమనబోయిన బుజ్జి మద్యం సేవించి బైక్‌పై వస్తూ బస్టాండ్ సెంటర్‌లో సీతారామపురం మండలం బసినేనిపల్లి గ్రామానికి చెందిన భాగ్యమ్మ రోడ్డుపై నడుకుంటూ వెళుతుండగా ఢీకొట్టాడు. ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే గండిపాళెం మార్గంలో తిరుమలాపురం ఎస్టీ కాలనీకి చెందిన సర్వర్ష, వాసు, వెంకాయమ్మ మోటార్‌బైక్‌పై ఉండగా రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. సర్వర్షకు తీవ్ర గాయం కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు బుజ్జిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం

నెల్లూరురూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాల ధారణ స్వాములకు కాకుపల్లి విఘ్నేశ్వరుడి ఆలయం వద్ద నిత్యాన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. ఆల్తూరి ఆదిశేషయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచాక్షరి మల్లయ్య, రామయ్య, వరిగొండ రామయ్యస్వామి, మస్తానయ్య బృందంగా ఏర్పడి, ఈనెల 24 నుంచి అన్నదానం చేస్తున్నట్లు వారు తెలిపారు. డిసెంబరు 2 వరకు చేస్తామని పేర్కొన్నారు. అయ్యప్ప మాలధారణ భక్తులే కాకుండా ఇతర మాల ధారణ భక్తులు కూడా పాల్గొన్నవచ్చని వారు తెలిపారు.



హమ్మయ్యా.. వర్షం ఆగింది!

నెల్లూరు(సిటీ), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నెల్లూరు నగరం తడిచిముద్దయింది. కాలువలు, ప్రధాన కూడళ్లు, రహదారులు నీటి మునిగి చెరువులను తలపించాయి. డ్రైనేజీ పొంగి రోడ్లపైకి రావడంతో నగర వాసులు అవస్థలు పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి మొంథా తుఫాన్ ఉత్తరాంధ్ర ప్రాంతంలో తీరందాటడంతో బుధవారం వాతావరణం ప్రశాంతంగా మారింది. దీంతో నగరంలో ప్రజలంతా బయటకు వచ్చి రోడ్లెక్కారు. ఇళ్లకే పరిమితమైన వారంతా ఎండను చూశారు. కనీసం ఇళ్లలో దుస్తులు ఆరేసుకునేందుకు కూడా వీలులేనంతగా వాతావరణం ప్రతికూలంగా మారడంతో నగర వాసులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. పరిస్థితి సాధారణ స్థితికి రావడంతో గురువారం నుంచి విద్యా సంస్థలు యథావిధిగా నడవనున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల సేవలన్నీ గురువారం నుంచి అందుబాటులోకి రానున్నాయి.

తుఫాన్ బాధితులకు టీడీపీ అండ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు టీడీపీ నేతలు అండగా నిలిచారు. బుధవారం మంత్రి గుడిసెల్లో నివశిస్తున్న వారికి ఆహార పొట్లాలు, టార్పాలిన్ పట్టలు అందచేశారు. మంత్రి నారాయణ సొంత నిధులతో టార్పాలిన్ పట్టలను టీడీపీ నేతలు బాధితులకు అందచేశారు. అలాగే మధ్యాహ్నం, సాయంత్రం భోజన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే టెలి కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి నారాయణ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కప్పిర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న ధర్మవరం సుబ్బారావు

● **ఆహార పొట్లాల పంపిణీ**

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తుఫాన్ బాధితులకు జనసేన పార్టీ నాయకులు బుధవారం ఆహార పొట్లాలు అందజేశారు. నగరంలోని కొత్తూరు గిరిజన ప్రాంతంలో 300 మందికి పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పెయ్యల పవన్‌కుమార్, వర్షాచలం రాజేష్, పేనేటి శ్రీకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తుఫాన్ బాధితులకు సహాయం చేస్తున్న కప్పిర శ్రీనివాసులు

శాశ్వత పరిష్కారానికి చర్యలు : గిరిధర్

నెల్లూరురూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ తాకిడికి దెబ్బతిన్న వనరులు, రోడ్లు, కల్వర్టుల సమస్యలపై శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కార్పొరేషన్, ఇతర శాఖల అధికారులు, పార్టీ నాయకులతో కలిసి బుజబుజనెల్లూరు, పొట్టేపాళెం, ఆటోనగర్ ప్రాంతాల్లో వరద నీటి తొలగింపు పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో ఎక్కడైతే తుఫాన్ తీవ్రతకు వనరులు దెబ్బతిన్నాయో వాటి స్థానంలో శాశ్వత నిర్మాణాలకు ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులంతా విపత్తు సమయంలో బాధితులకు అండగా నిలిచారని చెప్పారు. కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్ నిత్యం వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటు, అధికారులకు సూచనలు ఇచ్చారన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో వేదగిరి చైర్మన్ అచ్యుతరెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు చక్రవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



బుజబుజనెల్లూరు వద్ద పూడికతీతను పరిశీలిస్తున్న టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, తదితరులు

స్ట్రోక్ నివారణకు ఆధునిక వైద్య విధానాలు

● అపోలో ఆసుపత్రి వైద్యులు శ్రీరామ్ సతీష్, బిందుమీనన్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌స్ట్రోక్ నివారణలో అపోలో ఆసుపత్రి ముందంజలో ఉందని అపోలో మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, ప్రముఖ న్యూరో సర్జన్ విభాగాధిపతి డాక్టర్ బిందుమీనన్ తెలిపారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రెయిన్‌స్ట్రోక్ వస్తే పక్షవాతానికి గురయ్యే అవకాశం ఉందని, ప్రతి నిమిషం విలువైనదేనన్నారు. ఎంతత్వరగా రోగుని వైద్య నిపుణుడి వద్దకు తీసుకు వస్తే అంత త్వరగా కోలుకునే అవకాశం ఉందని చెప్పారు. డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ద్వారా కూడా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజింగ్ పరిశోధన కమిటీ కో చైర్మన్‌గా, బోర్డు సభ్యురాలిగా డాక్టర్ బిందుమీనన్ ఎంపిక కావటం పట్ల సంతోషంగా ఉందని డాక్టర్ శ్రీరామ్‌సతీష్ అన్నారు. స్ట్రోక్ రిస్క్ స్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. స్ట్రోక్‌కు గురయిన వారికి థ్రోంబోలిసిస్, థ్రోంబెక్టమీ వైద్య సేవలు తప్పనిసరిగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూరాలజిస్టులు డాక్టర్ శివశంకర్, డాక్టర్ రష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్లు శ్రీరామ్‌సతీష్, బిందుమీనన్

భక్తిశ్రద్ధలతో గోపూజ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట వేణుగోపాల స్వామి ఆలయ గోశాలలో గోపాష్టమి సందర్భంగా బుధవారం భక్తిశ్రద్ధలతో గోపూజ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాంత గోరక్షణ సహ ప్రమోద్ పీ.శశికుమార్ మాట్లాడుతూ గోమాత విశిష్టతను తెలిపారు. మనం కూడా గోమాతలకు రక్షణకు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మిడతల రమేష్, శ్రీధర్, ఏవీ రామమోహన్‌రావు, రాజేంద్రప్రసాద్, చినరామ్ పాల్గొన్నారు.

నిండా నీటితో వనరులు

● కలుజులు పారుతున్న చెరువులు ● పూర్తి సామర్థ్యంతో కనుపూరు కాలువ ● నీట మునిగిన పొలాలు



పూర్తి సామర్థ్యంతో కనుపూరు కాలువ



నీటితో కళకళలాడుతున్న వెల్లంటి చెరువు



కొమ్మరపూడి చెరువులోకి చేరిన వరద నీరు

గత పది రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నెల్లూరురూరల్లోని చెరువుల్లో భారీగా నీరు చేరాయి. చెరువులన్నీ పూర్తి సామర్థ్యంతో జలకళను తలపిస్తున్నాయి. అటు కనుపూరు కాలువ పూర్తి సామర్థ్యంతో నీరు పారుతోంది. వర్షాధారణపైనే ఆధారపడిన కొమ్మరపూడిలోని ఎర్ర, నల్లచెరువుల్లోకి భారీగా నీరు చేరుతుంది. ఇక చెరువులకు అనుకుని ఉన్న లోతట్టు భూములన్నీ నీటి మునిగాయి. దీంతో వానలొద్దు... వానదేవుడా... అంటూ ప్రజలు, రైతులు మొరపెట్టుకుంటున్నారు. మరోకపక్క అరటితోటలు స్వల్పంగా దెబ్బతిన్నట్లు సమాచారం. - నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

నెల్లూరు రూరల్‌లో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతూనే ఉన్నాయి.అంతకుముందు వారం పాటు వాయుగుండం ప్రభావంతోనూ వానలు కురిశాయి. దీంతో అటు గొల్లకందుకూరు, వెల్లంటి, కందమూరు, సజ్జాపురం, సౌత్‌మోపూరు, ములుముడి, ఆమంచర్ల, దొంతాలి ప్రాంతాల్లోని చెరువులకు జలకళ వచ్చింది. నెల్లూరు కాలువలోకి వచ్చిన వరదతో నెల్లూరు చెరువులోకి 300 క్యూసెక్కుల వరకు ప్రవాహం వస్తుండటంతో వాటిని పొట్టేపాళెం కలుజు నుంచి పెన్నాలోకి వదిలారు. దీంతో స్థానికంగా వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అటు ములుముడి వద్ద కూడా ఇదే దుస్థితి నెలకొంది. కనుపూరు కాలువ పూర్తి సామర్థ్యంతో దూసుకుపోతుంది. అన్నీ ప్రాంతాలలోని అత్యవసర గేట్లను తెరిచినట్లు అధికారులు తెలిపారు.

● **ఎట్టకేలకు చెరువులకు వరద**

వరదలు వస్తే తప్ప నీటి చెమ్మరాని కొమ్మరపూడిలోని ఎర్ర, నల్లచెరువుల్లోకి వరద ప్రవాహం చేరుతుంది. భారీ వర్షాల తాకిడికి ఈ గ్రామంలోని రెండు చెరువుల్లోకి నీళ్ల చేరుతుండటంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిండిన చెరువుల కింద ఉన్న లోతట్టు భూములన్నీ నీటి మునిగాయి.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : చిరసాని

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంటలు చేతికందకుండా పోయాయని, నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న అన్నీ జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వరితోపాటు ఉద్యాన పంటలైన అరటి, బొప్పాయి, మొక్కజొన్న, పత్తి, మిర్చి, శనగ, వేరుశనగ, పసుపు, పెసర, పొగాకు వంటి పంటలు అధిక వర్షాల కారణంగా నీటమునిగాయని పేర్కొన్నారు. గత ఏడాది కాలంగా గిట్టుబాటు ధర లభించన రైతులు తీవ్ర నిరాశలో ఉంటే మొంథా తుఫాన్ పూర్తిగా ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులతో పాటు ఎక్కువగా కౌలు రైతులు ఉన్నారని వారికి తగిన నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు.

నేడు పాదరక్షల పంపిణీ



పంపిణీ చేసేందుకు పెట్టెల్లో సర్దుతున్న చెప్పులు

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో బుధవారం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన పాదరక్షలను కుష్ఠువ్యాధిగ్రస్థులకు గురువారం పంపిణీ చేయనున్నారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకున్న చెప్పులను అధికారులు ప్రత్యేక అట్టపెట్టెలలో నింపి జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయనున్నారు. డీఎఫ్‌ఐడీ అంతర్జాతీయ స్వచ్ఛంధ సంస్థ ఈ చెప్పులను జిల్లాలోని కుష్ఠువ్యాధి రోగులకు ఇచ్చేందుకు బాధ్యత స్వీకరించింది. ఈ సందర్భంగా జిల్లా కుష్ఠువ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ జిల్లాలో కుష్ఠువ్యాధి బాధితులు 280 మంది ఉన్నారని. వారందరి ఈ చెప్పులను ఇస్తున్నామని చెప్పారు.

ఆహార పొట్లాల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి): నగరంలో తుఫాన్ బాధితులకు బుధవారం ఆహార పొట్లాలు, రెయిన్ కోట్లను అంతర్జాతీయ మానవహక్కుల రక్షణ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.ఇంతియాజ్ అందజేశారు.తుఫాన్ సందర్భంగా ప్రజలకు సేవలు అందించిన అధికారులను అభినందించారు.



పొట్టేపాళెం కలుజు పరిశీలన

నెల్లూరురూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - జొన్నవాడ రహదారిలోని పొట్టేపాళెం కలుజును కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం పరిశీలించారు. అక్కడ వాహనరాకపోకలు, కలుజు ఉధృతి, ప్రత్యామ్నాయ రోడ్డు గురించి ఆరా తీశారు. పరిస్థితి ఇబ్బందికరంగానే ఉన్నప్పటికీ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వాహనదారులు నెమ్మదిగా కలుజు దాటాలని, ద్విచక్ర వాహనదారులు ప్రత్యామ్నాయ రోడ్డుపైనే వెళ్లాలన్నారు. పెద్ద వాహనాలకు కలుజు ప్రవాహంతో సమస్యలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేదగిరి చైర్మన్ ఇందుపూరు అచ్యుతరెడ్డి, టీడీపీ సీనియర్ నేత శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



కలుజు వద్ద పరిస్థితిని ఆరా తీస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

14 పునరావాస కేంద్రాల్లో 500 మంది బాధితులు

నెల్లూరు(సిటీ),అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించిన కార్పొరేషన్ అధికారులు వారికి ఆహారం, తాగునీరు అందిస్తున్నారు.14 కేంద్రాలను ఏర్పాటు చేసిన మున్సిపల్ యంత్రాంగం బుధవారం ఉదయం నాటికి 500 మందిని అందులోకి తరలించారు. మరికొన్ని ప్రాంతాల్లో ఇళ్ల వద్దనే ఉన్నవారికీ ఆటోల్లో ఆహారం తీసుకెళ్లి అందించారు. కాగా నగరంలోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న ప్రదేశాలు, నీటి నిల్వ ప్రాంతాలను కమిషనర్ నందన్ ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు.



పునరావాస కేంద్రంలో బాధితులకు ఆహారం అందచేస్తున్న సిబ్బంది

పెద్దచెరుకూరులో మహా కుంభాభిషేక వేడుకలు

నెల్లూరురూరల్,అక్టోబరు 29,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్లోని పెద్దచెరుకూరు వద్ద వెలసి ఉన్న బాలత్రిపుర సుందరి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురష్కరించుకుని మహా కుంభాభిషేక వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారంతో మొదలైన ఈ వేడుకలు గురువారంతో ముగియనున్నాయి. ఆలయంలో అయ్యప్పస్వామి, సుబ్రమణేశ్వరస్వామి, కాలభైరవ, జంట నాగేంద్ర స్వాములు, విమానశిఖరంతో పాటు నూతన విగ్ర ప్రతిష్ఠను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణంలో యాగశాల ఏర్పాటు చేసిన అర్చక బృందం అందులో బుధవారం అధివాస, షడుచ, శాంతి, వృషభ, మూర్తి హోమాలతో పాటు అంగ, ప్రత్యంగ, కళా, రుద్ర, దుర్గా, శాలాంగ, మూలమంత్ర హోమాలను నిర్వహించారు. గురువారం శాంతి కల్యాణంతో ఈ వేడుకలు ముగిస్తాయని ఆలయ అధికారులు, అర్చకులు పేర్కొన్నారు.



యాగశాలలో ఏర్పాటు చేసిన హోమాల్లో పాల్గొన్న భక్తులు

చినజీయర్ స్వామికి అఖండ స్వాగతం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : త్రిదండి చిన్నరామానుజ జీయర్ స్వామికి బుధవారం నగరంలోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం వద్ద దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులు, నగర ప్రముఖులు, వేద పండితులు అఖండ స్వాగతం పలికారు. వేణుగోపాలస్వామి ఆలయం పునర్‌నిర్మాణం భూమి పూజ, శంకుస్థాపనకు ఆయన విశిష్ట అతిథిగా విచ్చేశారు. పూర్ణకుంభంతో స్వాగతం పలికిన తర్వాత స్వామి బాలాలయం, ఆంజనేస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం యాగశాలకు వస్తున్న స్వామీజీకి దేవతామూర్తుల వేషధారణలతో చిన్నారులు నృత్యం చేస్తూ పుష్పవర్షం కురిపించారు. కోలాట కళాకారులు కోలాట ప్రదర్శన, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. యాగశాలలో పూజలు చేసిన అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి నరసింహస్వామి ఆలయాలకు భూమి పూజ, శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, భక్తులకు, అనుగ్రహ మంగళశాసనాలు అందజేశారు. కాగా వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఐదుగురు వంశపారంపర్య ధర్మకర్తలు పర్యవేక్షిస్తుంటారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి స్వర్గస్థులు కావడంతో ఆయన కుమారుడు ఆనం చెంచుసుబ్బారెడ్డి చేత చిన్నరామానుజ జీయర్ స్వామీజీ ప్రమాణ స్వీకారం చేయించారు.



చిన జీయర్ స్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

ఘనంగా ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా బుధవారం రాత్రి శివపార్వతులకు వైభవంగా ప్రాకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, పుష్పాలంకరణలు జరిగాయి. భువనేశ్వరికి విశేష అలంకారం, పూజలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపారాధనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉభయదాతలు ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై తిరిగేదెలా...?

● ప్రమాదభరితంగా ప్రధాన రహదారి
● 25వ డివిజన్ ప్రజలకు తప్పని ఇక్కట్లు

నెల్లూరు(విద్య), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బుజబుజనెల్లూరు జాతీయ రహదారి పక్కనే ఉండటం, డివిజన్‌లోకి ప్రవేశించేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జి లేకపోవడం, ఏడాదికి పైగా జాతీయ రహదారి పనులు జరుగుతుండడంతో స్థానిక 25వ డివిజన్ ప్రజలు తమ ప్రాంతాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే చొరవతో సర్వీసు రోడ్డును నిర్మించారు. అయితే ఈ సర్వీసు రోడ్డును లారీలు, ఇతర వ్యాపారస్తులు ఆక్రమించుకోవడంతో ఈ రోడ్డంతా రద్దీగా మారింది. నగరంలో నుంచి డివిజన్‌లోకి వచ్చేందుకు ఈ ఒక్క రోడ్డే ఆధారం కావడంతో స్థానికులు ఈ సర్వీసురోడ్డులోనే అష్టకష్టాలు పడుతూ గమ్యానికి చేరుకునే వారు. ప్రస్తుతం ఈ రోడ్డుకూడా లేకపోవడంతో తల్పగిరి కాలనీలోకి ప్రవేశించి అక్కడ నుంచి డివిజన్‌లోకి ప్రవేశిస్తున్నారు. అయితే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఈ రోడ్డు కూడా పూర్తిగా ధ్వంసం కావడం, గుంతమయమైన ఈ రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోవడంతో వరుస ప్రమాదాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసే సమయంలో రోడ్డు కనపడక బురదలో పడిన బాధితులూ ఉన్నారు. పైగా ఈ రోడ్డుపైనే అడ్డంగా లారీలను నిలిపివేయడం, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను రిపేరు చేసుకోవడంతో పాటు రోడ్డుపైనే ఏర్పాటు చేసిన కొంతమంది వ్యాపారులు వాహనాలను అడ్డంగా పార్కు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా మారింది. ఈ రోడ్డుపై తామెలా తిరగాలని, ఇళ్లకు సకాలంలో ఎలా చేరాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నేతలు, అధికారులు దీనిపై దృష్టి సారించి ఆక్రమణలు తొలగించాలని, రహదారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పునరుద్ధరించాలని స్థానికులు కోరుకుంటున్నారు.



గుంతమయంగా మారిన రహదారి

రాష్ట్ర బ్యాడ్మింటన్ విజేతలకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ముక్కాల

నెల్లూరు(విద్య), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ అండర్-13 బాల, బాలికల పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ అభినందించారు. నగరంలోని ఆయన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో జరిగిన పోటీల్లో బాలుర సింగిల్స్‌లో టి.వర్షిత్, డబుల్స్‌లో టి.వర్షిత్-మహీధర్‌రెడ్డి విజేతలుగా నిలిచారన్నారు. అలాగే బాలికల విభాగం డబుల్స్‌లో జీ.లలితారెడ్డి ద్వితీయస్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో డిసెంబరు 13 నుంచి 16 వరకు బిహార్‌రాష్ట్రంలోని భాగల్పూర్‌లో జరిగే జాతీయ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ఆటతో ప్రతిభ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరప్రసాద్, కోచ్ వెంకటేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులపై ఫిర్యాదు

నెల్లూరు(విద్య), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వీఆర్ న్యాయ కళాశాలలో పూర్వ విద్యార్థుల పేరుతో చేస్తున్న అక్రమ వసూళ్లు, ర్యాగింగ్ దందాలపై చర్యలు తీసుకోవాలని ప్రస్తుత లఆ విద్యార్థులు బుధవారం ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. పూర్వ విద్యార్థులు వాట్సాప్ గ్రూపు పేరుతో కళాశాలలో నిర్మాణాలు, ఫంక్షన్‌లు, పరీక్షల్లో పాస్ చేయిస్తామంటూ అనధికారి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీటితోపాటు నూతన విద్యార్థినుల ఫోన్ నెంబర్‌లను సేకరించి వాని గ్రూపులో చేరాలని బెదిరింపులకు పాలడుతున్నారన్నారు. ఈ విషయమై విచారించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పోలీసులకు ఎస్పీ అభినందనలు

నెల్లూరు(క్రైం) అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జాతీయ రహదారుల్లో ప్రయాణించే భారీ వాహనాలను మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 4 గంటల వరకు నిలుపుదల చేసి సురక్షితంగా పంపిన జిల్లా పోలీసులకు ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దగదర్తి నుంచి కావలి టోల్ ప్లాజా వరకు, వెంకటాచలం, బుచ్చి,డీసీపల్లి టోల్ ప్లాజా వరకు కావలి, వెంకటాచలం, బుచ్చి, ఆత్మకూరు పోలీసులు వాహనాలను నిలిపి ప్రమాదాలు జరగకుంటూ పంపారన్నారు. తుఫాన్ కారణంగా ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల్లో జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ప్రయాణికుల భద్రత దృష్ట్యా అత్యవసర చర్యలు తీసుకున్నామన్నారు. వాహనాల నిలుపుదలలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు ఘట్టమనేని శ్రీనివాసరావు, శ్రీధర్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



హర హరా.. శంకరా!

● భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం

రాపూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాపూరులోని పురాతన శివాలయంలో కోటి సోమవారం పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామనాథేశ్వర ఆలయంలో రుద్రాభిషేకాలు, పూజలు జరిగాయి. సాయంత్రం రామనాథేశ్వస్వామికి, పర్వతవర్ధిని అమ్మవారికి విశేష పూలంగి సేవ, ప్రాకారోత్సవం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. శివనామస్మరణతో ఆలయం మారుమోగింది.

నేడు కోటి సోమవారం

● భక్తిశ్రద్ధలతో శివకేశవులకు ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పండుగల మాసం. ఈ మాసం లో సోమవారాలు, సోమవార వ్రతాలు విశేషమైనవి. ఈ మాసంలో భక్తులు సోమవారం వ్రతాలు ఆచరిస్తారు. గురువారం కోటి సోమవారం ఇంకా విశిష్టమైనది. శ్రవణానక్షత్రం కార్తీక మాసంలో ఎప్పుడు వస్తుందో.. ఆ రోజే కోటి సోమవారం వ్రతాలు, పూజ లు చేస్తారు. సూర్యోదయంతో శ్రవణా నక్షత్రం కూడి నరోజు గురువారం రావడంతో జిల్లాలో శివకేశవుల ఆలయాల్లో భారీ ఏర్పాట్లు చేశారు.

కోటి సోమవారం రోజు చేసే వ్రతం, ఉపవాసం, దానం కోటి రెట్లు పుణ్యఫలాన్ని ఇస్తాయని పురాణాల్లో పేర్కొన్నారు. కోటి సోమవారం ఉద యం నుంచి ఉపవా సం ఉండి ప్రదోషకాలంలో చేసే శివారాధన అత్యం త ఫలప్రదమైంది. ప్రదోషకాలం అంటే సూర్యాస్తమయం తర్వాత 2.24 గంటల



సమయాన్ని ప్రదోషకాలం అంటారు. ఆ సమయంలో కైలాసంలో పరమశివుడు అర్ధనారీశ్వర రూపంలో శివతాండవం చేస్తారు. ఆ సమయంలో దేవతలంతా పూజలు చేస్తారు. శివుడు ప్రసన్నుడై వారి కోర్కెలు తీర్చుతాడు. ఆ సమయంలో చేసే పూజ కూడా విశేష ఫలితాలను ఇస్తుందని శాస్త్ర వచనం. ప్రదోషకాలంలో శివలింగాలను ఆవుపాలతో అభిషేకాలు, అనంతరం మారేడు దళం, జిల్లేడు పూలు, తుమ్మి పూలతో పూజ చేయాలి. నైవేద్యం గా అరటిపండ్లు, కొబ్బరికాయలు సమర్పించాలి. కోటి సోమవారం శివాలయంలో దీపారాధన చేస్తే కోటి కార్తీక సోమవారాల దీపారాధన చేసి న ఫలితం లభిస్తుంది. అలాగే శివాలయంలో దీపదానం, వస్త్రదానం, సాలగ్రామ దానం, గోదానం చేయడం వల్ల కోటి సోమవారాలు శివారాధన ఫలితం లభిస్తుంది.ఈ రోజున పేదలకు అన్నదానం చేస్తే స్వర్గప్రాప్తి లభిస్తుంది. నదీ స్నానం చేస్తే 16వేల ఏళ్ల గంగాస్నానంతో సమానం. కోటి సోమవారం రోజున కన్యాదానం చేయడం వల్ల అశ్వమేధ యాగానికి సమానమైన ఫలితాన్ని ఇస్తుందని స్కంద పురాణం చెబుతోంది. కోటి సోమవారం రోజు ఏ వ్రతాన్ని ఆచరించినా ఆ వ్రత ఫలితం అనంతం. శివాలయాల్లో ప్రదోషకాల వ్రతాలు, వైష్ణవ ఆలయాల్లో వెంకటేశ్వరస్వామి వ్రతం, సత్యనారాయణ వ్రతాలు చేస్తే అధిక పుణ్యఫలం సిద్ధిస్తుంది.

ఉచిత న్యాయ సేవలను

ఖైదీలు వినియోగించుకోవాలి

● న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

వెంకటాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉచిత న్యాయసేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ కే వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె విచ్చేసి ఖైదీల యోగా క్షేమాలు, వారి కేసుల వివరాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయి అన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయసేవాధికార సంస్థ అధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా పేదలు న్యాయ సేవలు, సలహాలు పొందవచ్చన్నారు. ఖైదీలు ఇక్కడి నుంచి వెళ్లిపోయిన తరువాత కుటుంబ సభ్యులతో సంతోషంగా మెలగాలని ఆమె సూచించారు. అనంతరం గ్రీవెన్స్ బాక్సును ఓపెన్ చేసి చూశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సీహెచ్ బాల మహేష్, డిప్యూటీ చీఫ్ హర్ష, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడు.. నిండా సమస్యలే!



12 ఏళ్లుగా ఆపరేట్ చేయని పాత స్పిల్‌వేలోని గేట్లు

● ప్రాజెక్టులో మొత్తం గేట్లు 17.. పని చేసేవి నాలుగే!

● 12 ఏళ్లుగా ఆపరేట్ చేయని పాత స్పిల్‌వేలోని క్రస్ట్ గేట్లు

● ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

లింగసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో దీర్ఘకాలంగా సమస్యలు తిష్ఠ వేసి ఉన్నాయి. తుఫాన్లు, వాయుగుండాలు ఏర్పడిన ప్రతిసారీ ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంటోంది. ప్రాజెక్టులోని పాత స్పిల్‌వేలోని 10 క్రస్ట్ గేట్లు, 2 పూడు గేట్లు, కొత్త స్పిల్‌వేలోని 5వ రేడియల్ గేటు ఆపరేట్ చేయక పోవడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే పాత స్పిల్‌వేలోని 12 గేట్లు 2013లో ఏర్పాటు చేశారు. కానీ అప్పటి నుంచి వాటిని ఆపరేట్ చేయడం లేదు. వీటిని ఆపరేట్ చేస్తే కౌంటర్‌వెయిట్లు తెగి పడతాయని భయం. అలాగే కొత్త స్పిల్‌వేలోని 5 గేట్లలో నాలుగు మాత్రమే పని చేస్తున్నాయి. 5వ గేటు రోప్ రెండేళ్ల క్రితం వంకర తిరిగింది. దీంతో దీనిని ఆపరేట్ చేయడం లేదు. అయితే ఈ పాత స్పిల్‌వే నుంచి 1 లక్ష క్యూసెక్కులు, కొత్త స్పిల్‌వే నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేసే సామర్థ్యం ఉంది. అయితే, కేవలం 4 గేట్లు మాత్రమే పని చేస్తుండగా, వీటి నుంచి 1.20 లక్షల క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేయొచ్చు. అంతకుమించి వరద పోటెత్తితే పరిస్థితి ఏమిటని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు ద్వారా 60 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారని డీఈ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

● అలాగే ప్రాజెక్టు కొత్త స్పిల్‌వేలోని రేడియల్ గేట్లకు ముందు స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటుకు 2000వ సంవత్సరంలో ఈ స్పిల్‌వే నిర్మాణ సమయంలో కట్టడాలు నిర్మించారు. కానీ వాటిని ఏర్పాటు చేయలేదు. దీంతో 5వ గేటు మరమ్మతులకు గురైనా దానిని బాగు చేయాలంటే ఇప్పట్లో వీలుపడదు. ఇక ప్రాజెక్టు బ్రిడ్జి రోడ్డు కూడా 2012లో అభివృద్ధి చేసినా 12 సంవత్సరాలకే గుంతలు ఏర్పడి దారుణంగా తయారైంది. దీంతో అధికారులు, ప్రజాప్రతినిదులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డుపై అడుగడుగునా ఏర్పడిన గుంతలు

ప్రమాదపుటంచుల్లో కనిగిరి!

● 'ముంబయి' కలుజులకు గండి

● దెబ్బతిన్న మలిదేవి గేట్లు

● సదరన్ చానల్ ఎగువ ప్రాంతంలో కరకట్ట బలహీనం

● ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం.. కొరవడిన పర్యవేక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కోవూరు, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాలలో లక్షలాది ఎకరాలకు సాగునీరు, ప్రజలకు, మూగజీవాలకు తాగునీరందించే కనిగిరి రిజర్వాయర్‌కు ప్రమాదం పొంచి ఉంది. వరద ఎక్కువై ప్రమాద హెచ్చరికల నేపథ్యంలో ముంబాయి కలుజులకు అమర్చిన 5 (మలిదేవి రేడియల్ గేట్లు) గేట్లు పరిస్థితిని బట్టి ఒక్కొక్కటిగా లేపాల్సి ఉంటుంది. ఒక్క గేట్ నుంచి రోజుకు టీఎంసీ నీరు విడుదలౌతుంది. వీటికన్నా ముందు మలిదేవి కాలువకు 27 గేట్లతో ఉన్న మిట్ట కలుజుల నుంచి వరదను విడుదల చేస్తారు. ఇవికాకుండా పైడేరు ఎస్కేప్ చానల్‌లో ఉన్న 14 గేట్లు పూర్తిగా దెబ్బతిన్నది. అలాగే గేట్లపైన ఉన్న వంతెన కూలే పరిస్థితిలో ఉంది. సదరన్ ఛానల్‌కు ఎగువ భాగంలోని రిజర్వాయర్ కరకట్ట పొడవునా పలుచోట్ల దెబ్బతిని ప్రమాదాలను తలపిస్తోంది. రిర్వాయర్‌లోని 'ఐ లాండ్' పరిసర ప్రాంతంలోని కరకట్టలో సుమారు 50 ఎకరాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలతో ఊట జలాలు బయటకు వస్తుండటంతో రిజర్వాయర్‌కు ప్రమాదం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బత్తల హరికృష్ణ ఆధ్వర్యంలో ముంబాయి కలుజుల వద్ద ముళ్ల పొదలు తొలగింపు చర్యలు చేపట్టారు.



పూర్తిగా దెబ్బతిన్న పైడేరు ఎస్కేప్ చానల్ బ్రిడ్జి, షట్టర్లు

● దెబ్బతిన్న షట్టర్లు

ముంబాయి కలుజులో మలిదేవి లోలెవల్ మొదటి గేటుకు ఓ గండి, గేటు కింద మరో గండిపడి రిజర్వాయర్‌లోని జలాలు ఉధృతంగా మలిదేవి డ్రైన్‌లోకి ప్రవహిస్తున్నాయి. సుమారు 18 ఏళ్ళ క్రితం వరద ముంపుతో ఎత్తిన గేట్లను ఆ తరువాత పట్టించుకున్న పాపానలేదు. దీంతో ఆ గేట్లన్నీ తుప్పుపట్టి పలుచోట్ల దెబ్బ తినడంతో లేస్తాయో లేదోననే అనుమానాలు ఆ శాఖ అధికారుల్లోనే వ్యక్తమవుతున్నాయి. అంతేగాక మిట్ట కలుజులోని 27 షట్టర్లలో మొత్తం చెక్కలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో సుమారు 1.5 టీఎంసీల మేర పూడిక ఉండడంతో వాస్తవ నీటి సామర్థ్యం కూడా కోల్పోయింది. ఎగువ నుంచి వరద ఎక్కువైతే కనిగిరి రిజర్వాయర్‌కు ప్రమాదం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుత నీటిమట్టం 2.3 టీఎంసీలు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. నిర్వహణ పేరుతో నిధులు ఖర్చులు రాయడంతప్ప కనీసం రిజర్వాయర్ చుట్టూ ఒక్క ముళ్ళ పొదనూ తొలగించలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై డీఈఈ పెంచలయ్యను వివరణ కోరగా రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగకుండా పైడేరు చానల్ ద్వారా 2వేలు క్యూసెక్కులకుపైగా విడుదల చేస్తున్నట్టు తెలిపారు. వరద ప్రవాహం ఎక్కువైతే మలిదేవి కాలువకు విడుదల చేసే ప్రయత్నాలు చేస్తామని చెప్పారు.



తుప్పుపట్టిన మలిదేవి లోలెవల్ రేడియల్ గేట్లను పైకిలేపే చైన్ వీల్స్

పెరుగుతున్న నీటిమట్టం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్ నీటి మట్టం బుధవారం 19.3 అడుగులు (2.5 టీఎంసీ)కు చేరుకుంది. పైడేరు ఎస్కేప్ ఛానల్ ద్వారా 2,150 క్యూసెక్కులు, మిట్టకల్జుల ద్వారా 150 క్యూసెక్కుల మేర మలిదేవి కాలువలకు నీటిని విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

ఉద్యాన పంటలపై తుఫాన్ ప్రభావం

కాపాడుకోండిలా..!

జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి సూచనలు

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను జిల్లాలోని ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. వర్షం దాదాపుగా తగ్గుముఖం పట్టడంతో ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు రైతులు వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డి సూచిస్తున్నారు. ముఖ్యంగా మిరప, అరటి, పసుపు, చేమగడ్డ, బొప్పాయి, కూరగాయల రైతులు చేపట్టాల్సిన చర్యలను తెలియజేశారు.

● మిరప

మిరప తోటల్లో అధిక వర్షపు నీరు నిలువకుండా జగ్రత్తలు తీసుకోవాలి. వాలిపోయిన మిరప చెట్లను నిలబెట్టి చుట్టూ బోదెలను తయారు చేసుకోవాలి. మొక్కలు ఊటానికి వచ్చినప్పుడు ఒక లీటరు నీటిలో 10గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. పైపాటుగా ఎకరాకి 50 కేజీల యూరియా, 20 కేజీల ఎంవోపీ, 200 కేజీల వేపపిండి వేయాలి. తెగుళ్ల రాకుండా నివారించేందుకు 10 లీటర్ల నీటిలో 30గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్(సీవోసీ), ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

● అరటితోటలు

అరటి తోటల్లో సాధ్యమైనంత త్వరగా నీటిని తొలగించాలి. వాలిపోయిన చెట్లకు కర్రలతో ఊతాన్నివ్వాలి. నేల ఆరిన తరువాత సేద్యం చేసి ఒక్కో మొక్కకి 100గ్రాముల యూరియా, 80గ్రాముల ఎంవోపీ వేయాలి. అరటి తోటలకు ఆకుమచ్చ తెగులు రాకుండా ఉండేందుకు లీటరు నీటిలో ఒక మిల్లీ లీటరు ప్రోపికొనజోల్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. దుంప కుళ్ల నివారించేందుకు బోర్డో మిశ్రమం ఒక శాతం దుంప తడిసేలా పాదుల్లో వేయాలి.



● పసుపు, చేమగడ్డ

పొలాల్లో నిలిచిన వాన నీటిని తొలగించాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక లీటరు నీటిలో 2గ్రాముల రిడోమిల్ పిచికారీ చేయాలి. కుళ్ల తెగులు రాకుండా లీటరు నీటిలో 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్(సీవోసీ) కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి.

● బొప్పాయి

తోటల్లో నిలిచి నీటిని తొలగించి చెట్టు కాండానికి కుళ్ల తెగులు రాకుండా లీటరు నీటిలో 2 గ్రాముల రిడోమిల్ కలిపిన ద్రావణాన్ని మొదళ్లలో పోయాలి.

● కూరగాయలు

తోటల్లో నిలిచిన నీటిని తొలగించాలి. లీటరు నీటిలో 10గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. తోటలకు ఆకుమచ్చ తెగుళ్ల రాకుండా లీటరు నీటిలో ఒక గ్రాము బావిస్టన్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

సర్దార్ పటేల్ జయంతికి ఏర్పాట్లు : వీఎస్‌యూ వీసీ

నెల్లూరు(విద్య), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయిపటేల్ 150వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వీఎస్‌యూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో బుధవారం యువభారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వల్లభాయి పటేల్ ఐక్యతా సూత్రాలను పాటించడం ద్వారా యువత దేశాభివృద్ధికి తోడ్పడేలా వారిని చైతన్య పరుస్తామన్నారు. వీఎస్‌యూ తరపున అన్నీ కళాశాలల్లో పటేల్ జయంతి ఘనంగా నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 31వతేదీన నగరంలో వీఆర్‌సీ నుంచి పటేల్ విగ్రహం వరకు, నవంబరు 7న కావలిలో పాదయాత్రలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రొఫెసర్ డాక్టర్ వెంకట సుబ్బారెడ్డి, కమ్యూనికేషన్ అధికారి హరికృష్ణ, ఎన్‌వైకే అధికారి ఆకుల మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ శ్రీనివాసులు

86 వైద్య శిబిరాలు

నెల్లూరు (వైద్యం) : తుఫాన్ బాధితుల కోసం వైద్య ఆరోగ్య శాఖ 86 వైద్యశిబిరాలను ఏర్పాటు చేసింది. 77 పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి తక్షణ వైద్యం కోసం శిబిరంలో వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేశారు. శిబిరాల ద్వారా 4200 మంది రోగులకు వైద్యసేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాలను డీఎంహెచ్‌వో సుజాత, పలువురు అధికారులు పర్యవేక్షించారు.

5 రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక

● జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి

ఆత్మకూరు, అక్టోబరు 29 : వర్షాలకు జిల్లాలో 1,295 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సర్వేలో తేలిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పి సత్యవాణి తెలిపారు. బుధవారం ఆత్మకూరులోని ఏడీఏ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఐదు రోజుల్లో పంట నష్టాలను పూర్తిస్థాయిలో అంచనా వేసి రైతుల పేర్లు, వారి బ్యాంకు ఖాతా నెంబర్లతో ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులకు రైతులు సహకరించి వారి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రైతులకు యూరియా కొరత లేకుండా ముందస్తుగా 94,600 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇప్పటికే 11 వేల టన్నుల యూరియా దిగుమతి అయిందన్నారు. ముందుగా వరినారు పోసుకునే రైతులకు యూరియాను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఇన్‌చార్జ్ ఏడీఏ వి శేషగిరిరావు, నెల్లూరు ఏడీఏ సి నర్సోజీరావు, అగ్రిల్యాబ్ టెక్నికల్ ఏవో పి చంద్రభాను, ఆత్మకూరు ఎంఏవో కిషోర్‌బాబు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌లో ఫార్మాది కీలక పాత్ర

● కావలి వీఎస్‌యూ కళాశాలలో ఫార్మా కాలేజీ : వీసీ అల్లం శ్రీనివాసరావు

కావలి(టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశయమైన వికసిత్ భారత్ సాకారంలో ఫార్మా రంగం కీలక పాత్ర పోషించనుందని విక్రమ సింహపురి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వీఎస్‌యూ పీజీ కళాశాలలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో రిజిస్ట్రార్ కే.సునీత, డీన్ రమణా రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి వీసీ మాట్లాడారు. కొవిడ్ సమయంలో భారతదేశంలోని ఫార్మా రంగం వ్యాక్సిన్ తయారు చేసి ప్రపంచం మొత్తం సప్లై చేసిందన్నారు. మారుతున్న కాలానుగుణంగా యువత ఫార్మా రంగం పట్ల ఆసక్తి కనబరుస్తున్నారని, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల ద్వారా కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి ఆయా రంగాలను ప్రోత్సహిస్తున్నాయన్నారు. కావలి పీజీ కళాశాలలో కాలేజ్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్ కళాశాల ప్రారంభం అయ్యిందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులై ఏపీ ఎంసెట్‌లో అర్హత సాధించిన వారు కళాశాలలో ప్రవేశం పొందేందుకు అర్హులన్నారు. 60 సీట్లతో పాటు ఈడబ్ల్యుఎస్‌కు మరో 6 సీట్లతో కలిసి 66 సీట్లు ఉన్నాయని, 62 సీట్లు ఫస్ట్ కౌన్సెలింగ్‌లో భర్తీ అయ్యాయని తెలిపారు. డిమాండ్‌ను బట్టి భవిష్యత్‌లో మరిన్ని సీట్లు పెంచుతామని మాస్టర్ ఆఫ్ ఫార్మాసీ కూడా ప్రవేశపెడతామన్నారు. కావలి పీజీ కళాశాలకు పూర్వవైభం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వీఎస్‌యూ నెల్లూరు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 110 మంది గైర్హాజరు

వెంకటాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపు రి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలలో 110 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల కు మొత్తం 805 మంది విద్యార్థులకుగాను 695 మంది హాజర య్యారు.

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రీడ ల్లో పాల్గొని పతకాలు సాధించిన అత్యుత్తమ క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీవో ఆర్‌కె.యతిరాజ్ ఒక ప్రకటనలో తెలిపా రు. శాప్ క్రీడాయాప్ వెబ్‌సైట్ అయిన స్పోర్ట్స్ డాట్ ఏపీ డాట్ జీవీ డాట్ ఇన్ లోకి వెళ్లి రిజిస్ట్రేషన్స్, ప్లేయర్ రిజిస్ట్రేషన్‌లో నవంబరు 4లోగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కు నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సం ప్రదించాలని ఆయన తెలిపారు.

ఆలయాలు జాతి వైభవానికి చిహ్నాలు

● త్రిదండి రామానుజ చిన్న జీయర్ ● వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జాతి వైభవానికి చిహ్నాలు దేవాలయాలని త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి వెల్లడించారు. బుధవారం నెల్లూరు మూలాపేటలో ఉన్న పురాతన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ సంభాషణ చేశారు. దేశంలో తెలుగు జాతికి ఉన్న చరిత్ర మరే జాతికీ లేదని పేర్కొన్నారు. తెలుగు జాతికి రెండు వేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉందని తెలిపారు. రామేశ్వరం, మధురై ప్రాంతాల్లోని పురాతన ఆలయాల్లో తెలుగు లిపితో శాసనాలు కనిపిస్తాయన్నారు. వేణుగోపాలుని ఆలయ చరిత్ర 10 తరాలకు తెలిసేలా సర్వాంగ సుందరంగా నూతన నిర్మాణం చేయాలని ఇందులో ధర్మకర్తలు, దేవదాయ శాఖతోపాటు భక్తులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సుందరీకరణ పేరుతో పాత ఆలయాల స్థానంలో నూతన ఆలయాలు నిర్మిస్తే ఆయా ఆలయాల చరిత్రకు భంగం వాటిల్లుతుందని, ఈ విషయంలో దేవదాయ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఆలయ శంకుస్థాపన వేళకు మొంథా తుపాను నెమ్మదించి వర్షం ఆగడంపై చిన్న జీయర్ స్వామి హర్షం వ్యక్తం చేశారు. ఆలయానికి పూర్వవైభవం వస్తుందని మంగళశాసనాలు చేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ వేణుగోపాలస్వామి ఆలయాన్ని తమ పెద్దలు ఐదు తరాలుగా అభివృద్ధి చేశారని తెలిపారు. ఆలయం ఇటుక రాతి కట్టడం కావడంతో శిథిలావస్థలకు చేరిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జీయర్ స్వామి ఆశీస్సులతో పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరి జవహర్‌లాల్ మాట్లాడుతూ స్వామీజీ సూచనల మేరకు వేణుగోపాల స్వామి ఆలయాన్ని అనుకున్న సమయంకంటే ముందుగానే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సభ్యులు తుమ్మల సుమన్, తేజరెడ్డి, ఆనం చంద్రశేఖర్ రెడ్డి, మన్నెల లక్ష్మీనాథ్‌రెడ్డి, ఆనం చెంచుసుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్ రెడ్డి, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చిన్న జీయర్, మంత్రి రామనారాయణ



ఆలయ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జీయర్ స్వామి, మంత్రి తదితరులు

నేడు సంగం మండల సమావేశం

సంగం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన గురువారం ఉదయం 10గంటలకు జరుగుతుందని ఎంపీడీవో షాలెట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అన్ని శాఖల అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఎంపీపీ అనుమతితో ఇతర అంశాలపై సమీక్షించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11619
వెండి కిలో ధర	రూ. 151800
వెండి ఒక గ్రాము	రూ. 157.80

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం



సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సంగం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాలలో కార్తీక మాసం కోటి సోమవారం సందర్భంగా బుధవారం మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా వంగల్లులోని భీమేశ్వరా లయం, దువ్వూరులోని కోటేశ్వరస్వామి, తిరుమన కొండలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఎస్టీలకు దుప్పట్లు, ఆహార పదార్థాల పంపిణీ



పేదలకు సామగ్రి పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దుత్తలూరు కొండపై గల 50 ఎస్టీ కుటుంబాలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఈ విషయాన్ని జనసేన మండల అధ్యక్షుడు రవికుమార్ దృష్టికి రావడంతో వెంటనే ఆయన ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టె వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బుధవారం ఆయా కుటుంబాలను పరామర్శించి దుప్పట్లు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు.

పేదలకు భోజనం పొట్లాల పంపిణీ



పేదలకు అన్నం పొట్లాలు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

సంగం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజనసంఘం, మర్రిపాడు, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లో ముంథా తుపాన్ ప్రభావంతో వర్షాలకు ఇబ్బందులు పడుతున్న పేదలకు జనసేన నాయకులు అన్నం ప్యాకెట్లు, దుప్పట్లు టార్పాలిన్ కవర్లు పంపిణీ చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ జనసేనపార్టీ సీనియర్ నాయకులు చదలవాడ హరీష్ కుమార్ సహకారంతో ఆత్మకూరు జనసేన సీనియర్ నాయకులు డాడి భాను కిరణ్ పేదలకు అన్నం ప్యాకెట్లు, దుప్పట్లు, టార్పాలిన్ కవర్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో రవిచంద్ర, కృష్ణమోహన్, నిరంజన్, సబ్బు భాను, మురళీ, వెంకటేశ్వర్లు, వినయ్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం

ఉదయగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని ఆనాధ, వృద్ధ శరణాలయాలు, మదరసాల్లో పిల్లలకు, వృద్ధులకు బుధవారం ఐడియల్ యూత్ మూమెంట్(ఐవైఎం) సభ్యులు భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవైఎం రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మునాఫ్, ఉదయగిరి పట్టణాధ్యక్షుడు తారీఖ్‌అజీజ్, సభ్యులు సయిద్, ఇందాదుల్లా, అజారుల్లా పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

వింజమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాసిలామణి హాస్పిటల్‌లో బుధవారం ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీహెచ్‌ఓ మాసిలామణి పాల్గొని మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ నిర్మల, డాక్టర్ ప్రశాంత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న సొసైటీ అధ్యక్షుడే చల్లా వెంకటేశ్వర్లు

వింజమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రికల్చర్ ఆర్‌బీకేలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సొసైటీ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లుయాదవ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏవో వాసు, సొసైటీ సీఈవో మేకల రమణయ్య, సిబ్బంది, పాల్గొన్నారు.

శాంతించిన మొంథా తుఫాన్

- ఊపిరి పీల్చుకున్న ప్రజలు
- నీట మునిగిన పంట పొలాలు
- నష్టాల అంచనాలో అధికారులు



ఆత్మకూరు: ఎస్టీ కాలనీ వాసులకు భోజనం పంపిణీ చేస్తున్న అభిరామ్ ఆసుపత్రి సిబ్బంది



ఆత్మకూరు: మురగళ్లలో నీట మునిగి దెబ్బతిన్న వరిపైరు పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చెరువులు, వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. రైతులకు స్వల్ప నష్టం చేకూరినా, మెట్ట రైతాంగానికి ఊరటనిచ్చినట్లయింది. ఆత్మకూరు డివిజన్‌లోని 225 చెరువుల్లో 64 చెరువులు అలుగు పారుతున్నాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు, మహిమలూరు, వాశిలి తదితర చెరువులు అలుగు పారుతున్నాయి. మండలంలోని గొల్లపల్లి ఆనకట్ట వద్ద బొగ్గేరు ఏటికాలువ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఆత్మకూరు చెరువు అలుగు పారుతుండడంతో ఆత్మకూరు పట్టణంలోని స్పార్క్ సిటీలోని లేఅవుట్లు జలమయమయ్యాయి. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంతో చెరువు కట్టలకు ఎలాంటి ప్రమాదం తలెత్తలేదు. పంట పొలాలు నీటమునిగాయి. మండలంలోని మురగళ్ల, కరటంపాడు, కనుపూరుపల్లి, బండారుపల్లి, వెన్నవాడ గ్రామల్లో 151 హెక్టార్లలో వరి పొలాలు నీట మునిగాయి. అనంతసాగరం మండలంలో 658 హెక్టార్లలో వరి, వేరుశనగ, సంగం మండలంలో 7 హెక్టార్లలో వరి, చేజర్ల మండలంలో 105 హెక్టార్లలో వరిపంట నీట మునిగింది. అధికారులు పంట పొలాలను పరిశీలించి నష్టాలను అంచనా వేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు వేగవంతం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు తగ్గుముఖం పట్టడంతో పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని ఎస్టీ కాలనీ వాసులకు అభిరామ్ ఆసుపత్రి ఎండీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కెవి శ్రావణకుమార్ బుధవారం మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు.

వర్షాలకు పొంగి పొర్లుతున్న చెరువులు, వాగులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో రోజుల తరబడి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నక్కలగండి రిజర్వాయర్‌కు 20అడుగుల పైబడి వరద నీరు చేరడంతో జలకళను సంతరించుకుంది. గువ్వాడి, కాంచెరువు చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. అలాగే తూర్పురొంపిదొడ్ల ఊరచెరువుకు గండి పడడంతో రహదారులపైకి నీరు చేరుకొని రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఎస్‌ఐ రఘునాథ్ అక్కడికి చేరుకొని గ్రామస్థుల సహకారంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. కనియంపాడు-రామదేవులపాడు గ్రామాల సమీపంలోని పిల్లాపేరు వాగులోకి అధిక మొత్తంలో వరదనీరు చేరుకొని వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసి రహదారి ఇరువైపులా ముళ్లకంప వేయడంతో పాటు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

● **చేజర్ల :** మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. టికెపాడు సమీపంలోని బొగ్గేరు పొంగి ప్రవహిస్తుడడంతో చేజర్ల నుండి టికే పాడు, కోటితీర్థం, యనమదల, బిల్లుపాడు, కాకివాయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా గొల్లపల్లి సమీపంలో పందలవాగు పొంగి ప్రవహిస్తుండడంతో సంగం, చేజర్ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చిత్తలూరు గ్రామంలోని చేనేత కార్మికుల మగ్గాలలోకి నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అయితే ఈ వర్షాలకు ఎటువంటి ఆస్తి, పంట నష్టం వాటిల్లలేదు. కాగా, నల్లవాగును బుధవారం జనసేన మండల అధ్యక్షుడు పెరంకొండ మనోహర్, నరేష్, రామ్ కిషోర్, తదితరులు పరిశీలించారు.



వరికుంటపాడు : నిండిన నక్కలగండి రిజర్వాయర్



ఏఎస్ పేట : గండి పడిన ఉత్తర కాలువ

ఉత్తర కాలువకు గండి

● **ఏఎస్ పేట :** మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వరద ప్రవాహం అధికమై ఉత్తర కాలువకు గండి పడింది. ఏఎస్ పేట మండలంలోని పోనుగోడు గ్రామ సమీపంలో ఉన్న ఉత్తర కాలువ కట్ట తెగి గండి పడింది. దీనితో వరద నీరు సమీపంలోని పొలాలలోకి నీరు ప్రవాహిస్తున్నాయి. బుధవారం ఉదయం నుండి గండి పడి నీరు ప్రవాహిసున్నా సంబంధిత అధికారులు ఎలాంగి చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుఫాన్ నష్ట నివారణ చర్యలు వెంటనే చేపట్టండి

● అధికారులకు మంత్రి ఆనం ఆదేశం

ఆత్మకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రెవెన్యూ, పోలీస్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తుఫాన్ నష్ట నిరవారణ చర్యలను వెంటనే చేపట్టాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలు జారీచేశారు. బుధవారం ఆయన నెల్లూరులోని ఆయన క్యాంప్ కార్యాలయం నుంచి తుఫాన్ అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై ఆత్మకూరు నియోజకవర్గ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు వెంటనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పరిస్థితిని చక్కదిద్దే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడైనా తాగునీరు కలుషితమైతే ఆ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయాలని, అన్నిగ్రామాల్లో పంచాయతీ అధికారులు పారిశుద్య కార్యక్రమాలు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల వద్ద పోలీసు సిబ్బందిని నియమించి ఎవరూ అటు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రోన్ విజువల్స్ తీసి బ్లాక్ అయిన రోడ్లను గుర్తించి వెంటనే నివారణ చేర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తగు చర్యలు చేపట్టడంతో పాటు ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలతో పాటు నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి ఆనం

చెరువులకు గండ్లు పడకుండా చర్యలు : డీఈ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈ చంద్రమౌళి

ఉదయగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో సాగునీటి వనరులు జలకళ సంతరించుకున్నాయని, చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని జలవనరుల శాఖ డీఈ కె చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి మండలాల్లో 66 చెరువులు ఉండగా 90 శాతం చెరువులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయన్నారు. కొన్ని చెరువులు అలుగులు పారుతున్నాయన్నారు. మిగిలిన 10 శాతం చెరువులు సైతం త్వరలో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటాయన్నారు. నియోజకవర్గంలో ఏకైక జలాశయమైన గండిపాళెం జలాశయం పూర్తి సామర్థ్యం 35 అడుగులు కాగా 19 అడుగులకు చేరిందన్నారు. పైతట్టు ప్రాంతంలో పిల్లాపేరు, దున్నపోతుల వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జలాశయానికి 3,850 క్యూసెక్కుల ప్రవాహం వస్తుందన్నారు. జలాశయం నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశముందన్నారు. కుంటలు, చెరువులు, జలాశయాలు నీటితో నిండి ఉండడంతో పిల్లలు, పెద్దలు అటువైపు వెళ్లరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో ఏఎస్ పేట

● గ్రామస్థులు, యాత్రికుల అవస్థలు



ఏఎస్‌పేట-ఆత్మకూరు రోడ్డులో ప్రవాహిస్తున్న తెల్లపాడు చెరువు అలుగు

ఏఎస్ పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ఏఎస్ పేట జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఏఎస్‌పేట-నెల్లూరు రోడ్డులో ఉన్న నక్కలవాగు వంతెనపై వరద ప్రవాహం ఉద్రిక్తంగా ప్రవహించడంతో ఏఎస్ పేట నుండి పలు గ్రామాలకు, నెల్లూరుకు మంగళ,బుధవారాలు రాకపోకలు నిలిచిపోయాయి. ఏఎస్‌పేట-ఆత్మకూరు మార్గంలోని తెల్లపాడు చెరువు అలుగు ఉద్రిక్తంగా ప్రవహిస్తుండంతో మంగళవారం నుండి బుధవారం మధ్యాహ్నం వరకు వాహన రాకపోకలు నిలిచాయి. దీంతో దూర ప్రాంతాల నుండి దర్గాకు విచ్చేసిన భక్తులు తిరిగి అవస్థలు పడ్డారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

● విద్యుత్ సరఫరాకు అంతరాయం ● ప్రజల అవస్థలు

ఉదయగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షం నష్టాలను మిగిల్చింది. మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు, ఓపెంకుటిల్లు నేల కొరిగాయి. ఉదయగిరి పట్టణం షబ్బీర్ కాలనీలో ఓ విద్యుత్ స్తంభం ఇంటిపై, మరో విద్యుత్ స్తంభం రోడ్డుపై పడడంతో పట్టణంలో రాత్రంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని గండిపాళెం గ్రామం, పట్టణంలోని రోజ్‌ధార్‌వీధిలో గల సాధన ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో, యాదవ పాళెంలో చెట్లు నేలకొరిగి రాకపోకలు స్తంభించాయి. దిలావర్‌భాయ్‌వీధిలో షేక్ మొహ్మద్ పెంకుటిల్లు గోడలు వర్షానికి ఒక్కసారిగా కూలిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



ప్రైవేటు పాఠశాలలో కూలిన చెట్టు

మండలంలోని దుత్తలూరు పంచాయతీ ముత్తరాశిపల్లిలో నారపరెడ్డి వెంకటరెడ్డి, మండలంలోని రాచవారిపల్లి గ్రామానికి చెందిన కొంకల తిరుపాలురెడ్డి, గున్నం ప్రసాద్‌రెడ్డిలకు చెందిన పొగాకు బ్యారన్‌లు కూలిపోయాయి. పొగాకు బోర్డు అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా నివేదిక సిద్ధం చేయాలి

● జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి

అనంతసాగరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతాళపల్లి, గోవిందమ్మపల్లి, ఉప్పలపాడు, పీకేపాడు గ్రామాల్లో వరిపంట వర్షానికి దెబ్బతింది. జిల్లా వ్యవసాయ అధికారి పి సత్యవాణి బుధవారం పరిశీలిం చారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేసేలా నివేదికను సిద్ధం చేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాధికారి శైలజాకుమారి వీఏఏ కృష్ణవేణి తదితరులు ఉన్నారు. అలాగే, మండలంలోని బొమ్మవరం, అగ్రహారం గ్రామాల్లో తుఫాన్‌కు దెబ్బతిన్న మిరప, బొప్పాయి పంటలను జిల్లా ఉద్యానవన అధికారి ఎంవీ సుబ్బారెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు తెలియజేశారు. పంట నష్టం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త తిరుపాలు, ఆత్మకూరు ఉద్యాన అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.



అనంతసాగరం: రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి



ఉదయగిరి: పసుపు పంటను పరిశీలిస్తున్న జయశ్రీ

పసుపు పంట పరిశీలన

● **ఉదయగిరి:** మండలంలోని బండగానిపల్లి, జీ.చెరువుపల్లి పంచాయతీలో సాగులో ఉన్న పసుపు పంటను బుధవారం ఉద్యానవన శాఖాధికారిణి జయశ్రీ పరిశీలించారు. వర్షాలు అధికంగా కురవడంతో పంటలను పరిశీలించి తోటలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలన్నారు. దుంపకుళ్లు, వేరుకుళ్లు తెగుళ్లు సోకకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే బొప్పాయి పంటను పరిశీలించారు. అనంతరం పలు తెగుళ్లు, వాటి నివారణకు రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మణం

● మృతులు యూపీ వాసులు



అనంతసాగరం అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మణం చెందిన సంఘటన అనంతసాగరం మండలం ఉప్పలపాడు వద్ద 565 జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు కడప జిల్లా ప్రొద్దుటూరులో స్వీట్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. కాగా, పెళ్లివేడు కలకు రాహూరు మండలంలోని పెంచలకోన పుణ్యక్షేత్రంకు బుధ వారం రాత్రి మూడు కార్లలో బంధువులు, మిత్రులు బయలుదేరారు. అందులోని ఓ కారు ఉప్పలపాడు కూడలి సమీపంలో రోడ్డు కుడివైపు నిలిపి ఉన్న వరికోత యంత్రం లారీని ఢీకొంది. దీంతో కారులోని ఏడుగురిలో సయ్యద్ ఆసీఫ్ (20), బాషా (50) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు నయిమ్, అషరఫ్, కరన్‌పాల్, ఆదిల్‌పాల్, జబీవుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సోమశిల, అనంతసాగరం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన ఐదుగురిని అనంతసాగరం, మర్రిపాడు 108 వాహనాల ద్వారా ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేగూరు కాలువలో మృతదేహం

కోవూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పడుగుపాడు మజరా లక్ష్మీనారాయణపురం సమీపంలోని వేగూరు కాలువలో బుధవారం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి 45 సంవత్సరాలు ఉంటుందని, 5.7 అడుగుల ఎత్తు, బట్ట తల ఆనవాళ్ళు కలిగిన ఆయన ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి ప్యాంటు జేబులో మూడు రకాల మాత్రలను కనుగొన్నారు. పడుగుపాడు వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాగులో గల్లంతైన వృద్ధురాలి మృతదేహం లభ్యం



జయమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మనుబోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పొట్టేళ్ళ వాగులో గల్లంతైన గొట్లపాళెం గ్రామానికి చెందిన కిష్టమనేని జయమ్మ (67) మృతదేహాన్ని బుధవారం వెలికి తీశారు. సమాచారం అందిన వెంటనే పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ. శివరాకేష్ వాగు వద్దకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని పిలిపించారు. మంగళవారం రాత్రంతా గాలించినా జయమ్మ ఆచూకీ కానరాలేదు. బుధవారం వేకువన మరోమారు గాలించగా, వాగుకు పదిమీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. వాగులోంచి మృతదేహాన్ని రెస్క్యూ టీం బయటకు తీసుకువచ్చింది. జయమ్మ మృతదేహాన్ని చూసిన వెంట నే బంధువులు బోరున విలపించారు. శవపరీక్షల నిమిత్తం మృత దేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కావలి రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గురునాధం ఏడుకొండలు(49) మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం కావలి పట్టణం కళుగోళ శాంభవి ఆలయం సమీపంలో జరిగింది. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. ఎగువమార్గంలో న్యూటిన్ సుకియా నుంచి తాంబరం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతి చెందాడు. లోకో పైలెట్ సమాచారం మేరకు ఎస్‌ఐ వెంకట్రావు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించి మృతుడి వద్ద లభించిన ఆధారాల మేరకు పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ సమీపంలో ఉంటున్న ఏడుకొండలుగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు...

మనుబోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ తిరుమలశెట్టి మస్తానయ్య (62) అనే గిరిజన వృద్ధుడు బుధవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక మద్యం దుకాణంలో మస్తానయ్య కొంత కాలంగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 7వ తేదీన పనుల నిమిత్తం కేఆర్‌పురం నుంచి ఇంటికి వెళ్ళేందుకు జాతీయరహదారి దాటుతుండగా నెల్లూరు నుంచి గూడూరు వెళుతున్న కారు మస్తానయ్యను ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన మస్తానయ్యను చికిత్స నిమిత్తం గూడూరు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాలలోని వైద్యశాలలకు పంపి చికిత్సలు అందించారు. ఈనెల 17న ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకున్న మస్తానయ్య ఇంటివద్ద చికిత్స తీసుకుంటున్న క్రమంలో బుధవారం తెల్లవారుజామున చనిపోయాడు. దీంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హైవేపై భారీ వాహనాల నిలుపుదల

వెంకటాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై మొంథా తుఫాన్ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా భారీ కంటైనర్లు, వాహనాలను పోలీసులు నిలుపుదల చేశారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు తుఫాన్ తీరం దాటే సమయంలో భారీగా గాలులు వీచే అవకాశాలు ఉన్నందున ఎస్పీ డాక్టర్ అజిత సూచనల మేరకు పోలీసులు వాహనాలను నిలుపుదల చేసి ఆ తర్వాత సురక్షితంగా పంపారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు రూరల్, కావలి డీఎస్పీలు గట్టమనేని శ్రీనివాసరావు, శ్రీధర్, వెంకటాచలం సీఐ సుబ్బారావు తదితరులు పర్యవేక్షించారు.

మద్యం మత్తులో బైక్‌తో వీరంగం

● నలుగురికి గాయాలు

ఉదయగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ఓ వ్యక్తి బుధవారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో మోటార్ బైక్‌తో వీరంగం సృష్టించడంతో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన సోమనబోయిన బుజ్జి మద్యం సేవించి బైక్‌పై వస్తూ బస్టాండ్ సెంటర్‌లో సీతారామపురం మండలం బసినేనిపల్లి గ్రామానికి చెందిన భాగ్యమ్మ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ఢీకొట్టాడు. ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే గండిపాళెం మార్గంలో తిరుమలాపురం ఎస్టీ కాలనీకి చెందిన సర్వర్త, వాసు, వెంకాయమ్మ మోటార్‌బైక్‌పై ఉండగా రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. సర్వర్తకు తీవ్ర గాయం కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు బుజ్జిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకుంటే ఎలా!?

కావలి(టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచకపోతే ఎలాగని కాయకల్ప అంచనా కమిటీ వైద్యాధికారులు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఏరియా వైద్యశాలను కాయకల్ప అంచనా కమిటీ వైద్యాధికారులు సూరిబాబు, వేణుగోపాల్, క్రాంతిలు సందర్శించి ప్రధానంగా పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో డస్ట్ బిన్‌ల నిర్వహణ, ఇంజక్షన్‌లు వేసే గది దగ్గరుండే డస్ట్‌బిన్‌లో కవర్ లేకపోవడం, కిటికీల అవతలి వైపు అపరిశుభ్రత పట్ల అసహనం వ్యక్తం చేశారు. కళ్ల ముందు కనిపించే పరిసరాలతో పాటు ప్రాంగణంలో కనిపించని పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ శిరీష, ఆర్ఎంవో ప్రమీల, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు లేనివారికి మంజూరు చేస్తాం

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని ప్రతీ కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. కాకర్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా బుధవారం మండలంలోని గరిమెనపెంట పంచాయతీ చల్లగిరికల, గజ్జలవారిపల్లె, కొత్తపల్లి, చల్లావారిపల్లె, కోవివారిపల్లె గ్రామాలలోని 500 కుటుంబాలతో పాటు సాయిపేట పంచాయతీలోని కొమ్ముపాలెంలో పేదలకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. చల్లగిరికలలో దాదాపు 40 కుటంబాలు తమకు ఇళ్లు లేవని చెప్పడంతో వెంటే హౌసింగ్ అధికారులతో మాట్లాడి లబ్ధిదారులు ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ సీనియర్ నాయకు లు జీ.లక్ష్మీనరసింహం, దామా మహేశ్వరావు, యారవ క్రిష్ణయ్య, బొట్లగుంట హరిబాబు, పోలినేని చంద్రబాబునాయుడు, దామా శివబాబు, కుంకు మోహనరావు, ఓరుగంటి సుమన్, అల్లిక మధు, మామిళ్లపల్లి వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షం ఆగినా.. తగ్గని వాగుల ఉధృతి!



చెన్నకేశవ ఆలయంలో వర్షపు నీరు

జలదంకి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో రెండు రోజులు కురిసిన భారీవర్షాలు బుధవారం ఆగాయి. అయినా వాగుల వరద ఉధృతి తగ్గకపోవడంతో మండలంలోని పలు గ్రామాలకు రెండో రోజూ రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని చామదల వద్ద నేరెళ్లవాగు, చినక్రాక వద్ద చీకటివాగు, జలదంకి-తెల్లపాడు రోడ్డుపై టంకంవారిపాలెం వద్ద జలదంకి పెద్దచెరువు అలుగు వాగు, గోపన్నపాలెం వద్ద ఊళ్లవాగు, కమ్మవారిపాలెం వాగు, కృష్ణాపాడు ఉబ్బలవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలు నిలిచిన గ్రామాల ప్రజలు నిత్యావసరాలకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ అత్యవసర పరిస్థితులు ఏర్పడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. జలదంకి చెన్నకేశవుడి ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో కార్తీకమాస పూజలకు ఆటంకం ఏర్పడింది. బుధవారం వర్షం నిలిచి ఎండ రావడంతో రైతులు చకచకా వ్యవసాయ పనులు మొదలు పెట్టారు. ట్రాక్టర్‌తో దుక్కులు చేస్తూ వరినారుమళ్లు పోస్తున్నారు. పలు వాగుల వెంబడి ఉన్న పంట పొలాల్లో నీటి ప్రవాహం చేరి వ్యవసాయ ఎనులకు ఆటంకం ఏర్పడింది. చప్టాల వద్ద తహసీల్దారు ప్రమీల, ఎస్‌ఐ లతీఫున్నీసాలు తమ సిబ్బందిని కాపలా ఉంచి ఎవరినీ వాగుల్లోకి దిగకుండా చర్యలు చేపట్టారు. సాగులో ఉన్న మెట్ట పంటల నష్టంపై అధికారులు సర్వే చేస్తున్నారు.

జలదిగ్బంధంలో టిడ్కో గృహ సముదాయం

కావలిరూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ మద్దూరుపాడులోని టిడ్కో గృహాల సముదాయం మొంథా తుపాను కారణంగా కురిసిన వర్షాలతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. గత 3 రోజులుగా గృహ సముదాయాల చుట్టూ 5 అడుగుల మేర వర్షపు నీరు చేరింది. దీంతో వారు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతోపాటు కంపోస్టు మట్టిలో కలిసిన వర్షపు నీరు మొత్తం టిడ్కో గృహ సముదాయాల ఆవరణలో ఉన్న తాగు నీటిని సరఫరా చేసే బావిలోకి చేరడంతో బావిలో నీరు కలుషితం అయ్యింది. టిడ్కో గృహాలకు తూర్పు వైపున ఆనెమడుగు చెరువు ఉండటంతో పాటు గృహాల సముదాయం లోతట్టులో ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. అలాగే మండలంలోని అనేక గ్రామాలకు బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. గుండాలమ్మవాగు ఉధృతంగా ప్రవహించడంతో రుద్రకోట పంచాయతీ గుమ్మడిబందల గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టి చప్టాపై 6 అడుగుల మేర వర్షపునీరు పారింది. రూరల్ ఎస్‌ఐ సుభాషిణి, సిబ్బందితో గస్తీ నిర్వహించారు. ఆకుతోట గిరిజన కాలనీకి ఒక వైపు చెరువు కలుజు, మరోవైపు చప్టా వరద నీరు ఎక్కువై రాకపోకలు నిలిచిపోయాయి. చౌదరిపాలెం నుంచి జలదంకి మండలం గన్నారపుగుంట గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు పొంగి పొలాల గుండా వరదనీరు ప్రవహించటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచి పోయాయి. రుద్రకోట జాతీయ రహదారిపై ఒంగోలు వైపు మార్గంలో రెండు లైన్లలోకి వరద నీరు చేరడంతో రూరల్ సీఐ జీ. రాజేశ్వరావు వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

టిడ్కో గృహాలకు విముక్తి కల్పించండి : సీపీఎం

కావలి(టౌన్): జలదిగ్బంధం నుంచి టిడ్కో గృహాలకు విముక్తి కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం నేతలు టిడ్కో గృహ సముదాయంలో పర్యటించి ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిశీలించారు. అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, కృష్ణయ్య, చెన్నయ్య, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే దగుమాటి సుడిగాలి పర్యటన

కావలి : కావలి పట్టణం, రూరల్ మండలాల్లోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి స్థానిక నాయకులు అధికారులతో కలిసి బుధవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. మద్దూరుపాడులో టిడ్కో గృహసముదాయంను చుట్టు ముట్టి ఉన్న వరదను పరిశీలించి ఆ నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోమని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాంలకు చెప్పారు. రూరల్ మండలంలో రుద్రకోట పంచాయతీ గుమ్మడి బొందలకు వెళ్లే గుండాల వాగు ఉధృతంగా పారుతుండటంతో నాయకులు తుళ్లూరు మల్లికార్జున, ఉప్పాల వెంకట్రావు, సీఐ రాజేశ్వరరావు ట్రాక్టర్‌పై ఆ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం చెన్నాయపాలెం రోడ్డులోఉన్న ఆకుతోట గిరిజనకాలనీ, మన్నంగిదిన్నె గిరిజనకాలనీ, సర్వాయపాలెం పంచాయతీలోని సర్వాయపాలెం, మాతినవారిపాలెం గ్రామాలో పర్యటిం చారు. మన్నంగిదిన్నె రోడ్డుపై వర్షపు నీరు పొంగి పారుతూ రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో ఆ నీటిని కట్టడి చేయమని ఆదేశించారు. ముసునూరు గిరిజన కాలనీలో నీట మునిగిన గృహాల బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు.



కావలిరూరల్ : చెరువును తలపిస్తున్న పొలాలు

● రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

బిట్రగుంట : బోగోలు బజారు సెంటర్లో బుధవారం తెల్లవారు జామున చెట్టు ఆర్అండ్‌బీ రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. స్థానిక ఎస్‌ఐ ఎన్.ప్రభాకర్ చొరవ తీసుకుని వాహన రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టారు. అయన వెంట టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, తెలుగుతమ్ముళ్ళు ఇందుపూరు రామోహన్‌రెడ్డి, నాటకరాణి భాస్కర్‌లు ఉన్నారు. ఉమామహేశ్వరపురం ఉడ్‌హౌస్ పేట మధ్య ఉన్న కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో వర్షపు నీటిప్ర వాహానికి ఆటంకం కలిగింది. విషయం తెలుసుకున్న సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ స్పందించి సొంత నిధులతో ఎక్స్‌కవేటరు తెప్పించి 30 అడుగుల వరకు కాలువ గోడలకు అడ్డంగా ఉన్న గుర్రపుడెక్కను తొలగించారు. దీంతో వర్షపు నీరు సజావుగా ప్రవహించింది.



బిట్రగుంట : గుర్రపు డెక్కను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

● కూలిన విద్యుత్ స్తంభాలు

అల్లూరు : తుఫాన్ ధాటికి ఎక్కడా ప్రమాదాలు, నష్టాలు చోటు చేసుకోకపోయినప్పటికీ కొన్నిచోట్ల స్వల్ప నష్టాలు జరిగాయి. అల్లూరు పట్టణ పరిధిలోని బలిజపాలెంలో గోడ కూలిపోయింది. నార్తుమోపూరు గిరిజన కాలనీలో గుడిసెపై చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో గృహం స్వల్పంగా దెబ్బతింది. చింతగుంట సమీపంలో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో పాటు అనేక స్తంభాలు పక్కకు ఒరిగాయి. పొలాల్లో భారీస్థాయిలో నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని కొంతమందిని అల్లూరు రామకృష్ణ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు.

వరద నీటిలో చేపల వేట



వరద నీటిలో చేపలు పడుతున్న ప్రజలు

కావలి(టౌన్): పట్టణంలోని బృందావనం కాలనీ ఎదురుగా కాలువలో ప్రవహిస్తున్న వరద నీటిలో చేపల వేటకు పట్టణ ప్రజలు ఎగబడ్డారు. భారీ వర్షాలకు ముసునూరు మండాటి చెరువు పొంగి బృందావనం కాలనీ ఎదురుగా ట్రంకురోడ్డు పక్కనున్న కాలువలో ప్రవహిస్తున్న నీటిలో దండిగా చేపలు కనిపించడంతో విషయం తెలుసుకున్న ప్రజలు అక్కడికి చేరుకున్నారు. చీరలు, దోమతెరలు, గ్రీన్ కర్టెన్లు.. ఇలా ఏది దొరికితే అది తెచ్చుకుని చేపలు పట్టుకుని బస్తాలలో నింపుకుని తీసుకెళ్లారు. ట్రంకురోడ్డు వైపు ప్రయాణించే వాహన చోదకులు ప్రజలు చేపలు పట్టుకోవడాన్ని ఆసక్తిగా తిలకించారు. దీంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.

మాలకొండలో రేపు హుండీల లెక్కింపు

వలేటివారిపాలెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కొండపైన కల్యాణ మండపంలో ఈనెల 31వ తేదీన ఉదయం 8 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాలేపాటి కుటుంబానికి పలువురి పరామర్శ



మాలేపాటి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాయపాటి శైలజ

దగదర్తి (బిట్రగుంట), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దగ దర్తికి చెందిన టీడీపీ నేత, దివంగత ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డవలెప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబాన్ని బుధవారం పలువురు నేతలు పరామర్శించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ, కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఆర్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి భానుచందర్‌నాయుడు చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళుఅర్పించారు. అనంతరం మాలేపాటి రవీంద్రనాయుడు, మాలేపాటి నరేష్, లోకేష్‌లను పరామర్శించారు. అలాగే ఉదయగిరి మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, బొల్లినేని రామారావులు మాలేపాటి రవీంద్రనాయుడు, కుటుంబ సభ్యులను పరామ ర్శించారు.

● నేడు దగదర్తికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాక

కావలి(ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గురువారం మధ్యాహ్నం దగదర్తికి వస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి స్థానిక నేతలకు సమాచారం అందింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుడు ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడి తనయుడు బానుచందర్ నాయుడులు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కర్మక్రతువులు గురువారం వారి స్వగ్రామమైన దగదర్తిలో జరుగుతుండటంతో ఆ కార్యక్రమంలో ఆయన పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అక్కడ జరిగే సంతాపసభలో పాల్గొననున్నారు.

నిండిన చెరువులు - లోతట్టు ప్రాంతాల్లో తగ్గని నీరు



కందుకూరు : జగనన్న లే అవుట్‌లో నిలిచిన వరద నీరు

కందుకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలతో కందుకూరు ప్రాంతంలోని చెరువులన్నీ పూర్తిస్థాయిలో నిండాయి. లోతట్టు ప్రాంతాలు నీటిలో మగ్గుతోన్నాయి. కందుకూరు ప్రాంతంలో అత్తాకోడళ్ల చెరువులుగా ప్రసిద్ధి చెందిన మోపాడు, మాచవరం చెరువులు నిండటంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదలచేశారు. దీంతో కందుకూరు - కొండముడుసుపాలెం గ్రామాల మధ్య అలుగువాగు ఉప్పొంగి బుధవారం ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మాచవరం కొండ వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కందుకూరు-గుడ్లూరు మార్గంలో, చుట్టుగుంట మార్గంలో ఉన్న వాగులన్నీ ఉప్పొం గటంతో కందుకూరు-ఉలవపాడు మార్గంలోను రాకపోకలు స్తంభించాయి. కోత దశలో ఉన్న వరిపైరు పూర్తిగా దెబ్బతినింది. పొగాకు, మిరపనారుమడులు దెబ్బతిన్నాయి. ఉలవపాడు మండలంలోని తీరప్రాంతంలో వందలాదిఎకరాలలో సాగుచేసి ఉన్న చామగడ్డ పైరుకు తీవ్రనష్టం వాటిల్లింది. పట్టణంలోని మహదేవపురం రోడ్డులో ఉన్న జగనన్న లే అవుట్‌ను వరదనీరు చుట్టుముట్టింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ట్రాక్టరులో వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఉప్పుచెరువు కాలనీ, టిడ్కో సముదాయాలకు వెళ్లే రోడ్డు, కేసరిగుంటకాలనీ, శ్రీనగర్ కాలనీ ప్రాంతాలలో వరదనీరు నిలిచి ఉంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించారు. తుఫాన్‌లో సహాయక చర్యలు చేపట్టిన టీడీపీ నేతలను ఎమ్మెల్యే అభినందించారు. కాగా భారీవర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండగా ఎక్కడ చూసినా చేపల వేటలో యువకులు తలమునకలయ్యారు. మోపాడు చెరువులోకి ప్రవహించే పందివాగు, ఎర్రవాగుల్లోకి పెద్దఎత్తున చేపలు రావటంతో పట్టుకుంటూ కనిపించారు. బడేవారిపాలెం సమీపంలోని ఎర్రవాగులో వలలు వేసి చేపల వేట సాగిరచారు.

● వాగులు, వంకలు ఉగ్రరూపం

లింగసముద్రం: భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చాయి. పెదపవని సమీపంలోని ఉప్పుటేరులో వరదప్రవాహం ఎక్కువైంది. వంతెనపై రెండు మూడు అడుగుల మేరకు నీరు ప్రహించింది. దీంతో లింగసముద్రం ఎస్‌ఐ ఎం నారాయణ ఉప్పుటేరుకు ఇరువైపులా ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ అడ్డుగా పెట్టి, పోలీసు సిబ్బందిని కాపలాగా ఉంచి రాకపోలు నిలిపివేయించారు. మన్నేరు సైతం ఉప్పొంగింది. వెంగళాపురంకు తూర్పున ఉన్న పొలాల్లోకి రైతులు వెళ్లేందుకు వీలు లేకుండా గండివాగుపై ఉన్న వంతెన వద్ద మట్టి కోతకు గురైంది. మొగిలిచెర్ల వద్ద నేరెళ్లవాగు, వీఆర్ కోట తూనుగుంట గ్రామాల మధ్య ఉన్న వాగులు పొంగి ప్రవహించాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే బుధవాంరం ఉదయం నుంచి వరుణుడు శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

● కూలిన ఇంటిని పరిశీలించిన..

మండలంలోని వీఆర్ కోట పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో వర్షాలకు కూలిన సోమేపల్లి విజయమ్మ ఇంటిని తహసీల్దారు కే.కోటేశ్వరరావు ఆర్‌ఐ ఎం.రమణయ్యతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అమానుల్లాఖాన్, పంచాయతీ కార్యదర్శి సాయికిరణ్, అంగన్వాడీ కార్యకర్త కే.మమత, ఎంఎల్‌హెచ్‌వో ఎం.షర్మిల పాల్గొన్నారు.

● అప్రమత్తంగా ఉండండి

రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావంతో పూర్తి స్థాయిలో నిండిన రాళ్లపాడు ప్రాజెక్టును బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆయన సందర్శించారు. రైతులకు దిగువ ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈలు వెంకటేశ్వర్లు, పీ.శేషయ్య, ఏఈ మనోహర్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● తూముకు మరమ్మతులు

వలేటివారిపాలెం: మొంథా తుపాను ప్రభావంతో మండలంలోని అంకభూపాలపురం కొత్త చెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరింది. దీంతో తూము వద్ద లీకేజీ ఏర్పడి నీరు దిగువనున్న తూమలేరుకు వృథాగా ఎవడాన్ని గుర్తించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందిచారు. స్పందించిన అధికారులు స్థానికుల సహకారంలో ఎక్స్‌కవేటర్ తీసుకొచ్చి లీకేజీ నివారణకు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రామయ్య, పంచాయతీ కార్యదర్శి గణేష్, ప్రగడ మోహన్‌కుమార్, మంగి లాజర్, తాతిరెడ్డి వెంకటకొండారెడ్డి పాల్గొన్నారు.

● కూలిన పొగాకు బ్యారెన్‌లు

వారం రోజులుగా కురిసిన వర్షాలకు వలేటి వారిపాళెం, ఉదయగిరి మండలాల్లో పొగాకు బ్యారెన్లు దెబ్బతిన్నాయి. వలేటివారిపాళెం మండ లం పోలినేనిచెరువులో రెండు పొగాకు బ్యారెన్లు దెబ్బతినగా, రూ.8 లక్షలు నష్టం వాటిల్లింది. శనివారపు కృష్ణారెడ్డి, మాల్యాద్రిరెడ్డి జాయింట్ బ్యారెన్, నరాల మాధవ, నేలపాటి కరుణాకర్‌లకు చెందిన జాయింట్ బ్యారెన్లు కూలిపోయాయి. ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు పంచాయతీలోనూ పొగాకు బ్యారెన్ దెబ్బతిన్నది

● పునరావాస కేంద్రాల సందర్శన

ఉలవపాడు: మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధిత ప్రజలను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు పరామర్శించారు. మన్నేటికోటలో తిరుపతి కుంట ఎస్టీలకు కల్పించిన పునరావాస కేంద్రం, కరేడు పంచాయతీ పరిధిలోని బాలకోటయ్య సంఘం తుఫాన్ షల్టర్‌లో ఆశ్రమం పొందుతున్న మర్రిచెట్టు సంఘం ఎస్టీలు, చాకిచర్ల పునరావాస కేంద్రంలోని బాధితలను పరామర్శించారు. శిబిరాల్లో కల్పించిన వసతులను పరిశీలించి వైద్య, రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు.

● పోలీసులను అభినందించిన ఎస్పీ

మండలంలోని వీరేపల్లి చెరువు నిండిపోయి ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గం ఏకైక రోడ్డు కోతకు గురై కాలనీవాసులు ఇబ్బందులకు ఎదుర్కుంటున్నారని తెలిసిన కందుకూరు డీఎస్పీ సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, సీఐ అన్వర్‌బాషా, ఎస్సై అంకమ్మ తమ సిబ్బందితో మంగళవారం రాత్రి యుద్ధప్రాతిపదిక మీద చర్యలు చేపట్టారు. రోడ్డు మార్గానికి ఆటంకంగా ప్రవహిస్తున్న చెరువు నీళ్లను ఎక్స్‌కవేటర్‌తో పక్కదారికి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. ఆ రాత్రంతా గస్తీ ఏర్పాటు చేసి కాలనీవాసులకు భద్రత కల్పించారు. ఈ చర్యలను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అభినందించారు.



లింగసముద్రం: గండివాగుపై ఉన్న వంతెన వద్ద కోసుకొని పోయిన మట్టి



వలేటివారిపాలెం : కూలిన పొగాకు బ్యారెన్



ఉలవపాడు: వీరేపల్లి చెరువు వద్ద పర్యవేక్షిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

అటా..? ఇటా..?

గూడూరుపై తొలగని అస్పష్టత





- వెంకటగిరి మండలాలను ఎటు కలుపుతారు?
- నగరి మొత్తం తిరుపతిలోకేనా?
- జిల్లాల పునర్విభజనపై అదే అనిశ్చితి

ఇంతకీ గూడూరు జిల్లా అవుతుందా.. లేక నెల్లూరు జిల్లాలో కలుస్తుందా? వెంకటగిరి ఎటు ఉంటుంది? నగరి నియోజకవర్గం మొత్తం అటా.. ఇటా?

ఈ ప్రశ్నలకు బుధవారం జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలోనూ సమాధానాలు లభించలేదు. అస్పష్టత యధాతథంగా కొనసాగుతోంది. ప్రజల ఆకాంక్షలు, ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు సహా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ఏమవుతాయనే సందేహాలు మిగిలిపోయాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గూడూరు.. నెల్లూరు జిల్లాలోకి

గూడూరు నియోజకవర్గాన్ని అక్కడి ప్రజల కోరిక మేరకు నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తామని గతేడాది ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతకు ముందే యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ సైతం గూడూరు ప్రజలకు అదే విధమైన వాగ్దానం చేశారు. వీటిని దృష్టిలో పెట్టుకుని చూస్తే ప్రస్తుత మంత్రివర్గ ఉపసంఘం కూడా గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపేందుకు సానుకూలంగా ప్రతిపాదించే అవకాశముంది. అయితే అక్కడ ఇటీవల వినిపిస్తున్న గూడూరు జిల్లా ఏర్పాటు మాత్రం లేనట్టే భావించాలి.

వెంకటగిరి ఎటు?

వెంకటగిరి నియోజకవర్గంలో ఆరు మండలాలుండగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు తిరుపతి జిల్లాలో కలిపిన గత ప్రభుత్వం మిగిలిన కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరు జిల్లాలోనే కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ విభజన పరిపాలనా పరంగా అసౌకర్యం కలిగిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాన్ని పూర్తిగా అటు నెల్లూరులోనో లేక ఇటు తిరుపతి జిల్లాలోనో కలపాల్సిన అవసరం ఏర్పడింది. వెంకటగిరి నుంచీ నెల్లూరుకు 82 కిలోమీటర్ల దూరం కాగా తిరుపతికి 50 కిలోమీటర్లు. ఈ విషయంలోనూ మంత్రివర్గ ఉపసంఘం ఓ నిర్ణయానికి రాలేదు.

నగరి మొత్తం తిరుపతిలోకే!

నగరి నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం రెండు జిల్లాల నడుమ విభజించి అసౌకర్యానికి, అయోమయానికి కారణమైంది. నగరి, నిండ్ర, విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాలో కొనసాగించిన గత ప్రభుత్వం మిగిలిన పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలో కలిపింది. ఇది పాలనాపరమైన సమస్యలకు దారి తీసింది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నగరి నియోజకవర్గం మొత్తాన్నీ తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు చిత్తూరు కలెక్టర్ సైతం నగరి, నిండ్ర, విజయపురం మండలాలను చిత్తూరు నుంచీ తొలగించి తిరుపతి జిల్లాలోనే కలపాలని సిఫారసు చేశారు. స్థానిక ఎమ్మెల్యే అభిప్రాయాన్ని, చిత్తూరు కలెక్టర్ నివేదికను దృష్టిలో వుంచుకుని చూస్తే మంత్రివర్గ ఉపసంఘం నగరిని పూర్తిగా తిరుపతిలో కలిపే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదించాల్సి వుంది. కాకపోతే దీనిపైనా ఇప్పటి దాకా ఒక నిర్ణయం తీసుకోలేదు.

రెవెన్యూ డివిజన్లలో మార్పులు

గూడూరును నెల్లూరులో కలపడం తప్పనిసరి కానుంది కాబట్టి రెవిన్యూ డివిజన్ల పరంగా మార్పులు అనివార్యం కానున్నాయి. ఇప్పటి వరకూ వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు గూడూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో వున్నాయి. గూడూరు తిరిగి నెల్లూరులో విలీనమైతే వెంకటగిరికి చెందిన మూడు మండలాలను శ్రీకాళహస్తి రెవిన్యూ డివిజన్ పరిధిలోకి చేర్చాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రతిపాదించారు. అలాగే నగరి నియోజకవర్గం పూర్తిగా తిరుపతిలో విలీనమైతే నగరి రెవిన్యూ డివిజన్ ఈ జిల్లా పరిధిలోకి వస్తుంది. గూడూరును కోల్పోయే పక్షంలో నగరి డివిజన్ ఆ లోటును భర్తీ చేయనుంది. మొత్తం మీద జిల్లాలోని నాలుగు డివిజన్ల సంఖ్య యధాతథంగా వుంటుంది.

నాయుడుపేట జిల్లా సాధ్యం కాదు

నాయుడుపేట కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి, మంత్రివర్గ ఉపసంఘానికి వినతులు అందినట్టు సమాచారం. దీనిపై మంత్రివర్గ ఉపసంఘం జిల్లా యంత్రాంగం అభిప్రాయాన్ని కోరిందని సమాచారం. అయితే నాయుడుపేట కేంద్రంగా జిల్లా ఏర్పాటు ఆచరణ సాధ్యం కాని ప్రతిపాదనగా పేర్కొంటూ జిల్లా యంత్రాంగం నివేదిక ఇచ్చినట్టు తెలిసింది.

నగర పంచాయతీలుగా వరదయ్యపాలెం, సత్యవేడు

జిల్లాలో ఇప్పటికే తిరుపతి కార్పొరేషన్‌తో పాటు శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి తదితర ఆరు మున్సిపాలిటీలున్న సంగతి తెలిసిందే. వీటికి మరో రెండు మున్సిపాలిటీలు తోడయ్యే అవకాశం కనిపిస్తోంది. సత్యవేడు, వరదయ్యపాలెం మండల కేంద్రాలను నగర పంచాయతీలుగా మార్చాలంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. శ్రీసిటీతో పాటు ఏపీఐఐసీకి చెందిన పలు పారిశ్రామిక పార్కులు వుండి, అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలున్న ప్రాంతం కావడంతో సత్యవేడు, వరదయ్యపాలెం మండల కేంద్రాలు వేగంగా అభివృద్ధి చెందుతూ విస్తరిస్తున్నాయని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని వీటిని పంచాయతీల నుంచీ నగర పంచాయతీలుగా స్థాయి పెంచాలని ప్రతిపాదించారు. సత్యవేడు పంచాయతీ ప్రస్తుత జనాభా 17 వేలు కాగా సమీపంలోని కాలమనాయుడు పేట, కొత్తమారికుప్పం, ఎన్ఆర్ అగ్రహారం, వీఆర్ కండ్రిగ తదితర పంచాయతీలను కలుపుకుంటే జనాభా సుమారు 30 వేలకు చేరుతుంది. వాటిని కలిపి నగర పంచాయతీగా మార్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే వరదయ్యపాలెం మండల కేంద్రం ప్రస్తుత జనాభా 7 వేలకు పైగా వుంది. దాన్ని కూడా నగర పంచాయతీగా మార్చే అవకాశం కనిపిస్తోంది. సమీప భవిష్యత్తులో గూడూరు మున్సిపాలిటీని కోల్పోయినా నగరి మున్సిపాలిటీ జిల్లాకు చేరనుంది.

ఎల్వీఎం3-ఎం5 రాకెట్‌కు తుది పరీక్షలు



సూళ్లూరుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో భారీ ఉపగ్రహ ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. ఇప్పటి వరకు ఎన్నో శక్తిమంతమైన ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపిన ఇస్రో తాజాగా 4,410 కిలోల బరువు కలిగిన మల్టీబ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. నవంబరు 2న సాయంత్రం 5:26 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం3-ఎం5 రాకెట్ నింగిలోకి ఎగరనుంది.ప్రయోగ వేదికపై ఉన్న రాకెట్‌కు బుధవారం శాస్త్రవేత్తలు తుది పరీక్షలు నిర్వహించి ప్రయోగానికి సిద్ధం చేస్తున్నారు.ప్రయోగానికి సంబంధించిన ఎంఆర్ఆర్ సమావేశం ఈ నెల 31న షార్‌లో జరగనుంది. అదేరోజు మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) సమావేశం షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో కౌంట్‌డౌన్ సమయం అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రస్తుతం ఇస్రో వర్గాల సమాచారం మేరకు కౌంట్‌డౌన్‌ను 24 గంటల ముందు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇస్రో అత్యంత బరువైన ఉపగ్రహాన్ని భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఇదే ప్రథమం. భారత్ సహా విశాలమైన సముద్ర ప్రాంతంలో కమ్యూనికేషన్ సేవలు అందించడం కోసం ఈ ఉపగ్రహాన్ని మన శాస్త్రవేత్తలు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి ప్రయోగిస్తున్నారు. రాకెట్ ప్రయోగం 16 నిమిషాల్లో పూర్తయ్యేలా డిజైన్ చేశారు.

పోలిలో సోలార్ ప్లాంట్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి డివిజన్‌లోని పోలి గ్రామంలో 58ఎకరాల్లో సోలార్ ప్లాంట్‌కు భూమి కేటాయించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు. జిల్లా సౌర విద్యుత్ పనులు వేగవంతంగా సాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 25మెగా వాట్ల సోలార్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని అందులో భాగంగా మోహన్ స్పిన్‌టెక్స్ కంపెనీకి పనులు అప్పగించామన్నారు. 25మెగావాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకోసం పోలి గ్రామంలో భూమి మంజూరు చేసినట్లు తెలిపారు.



గూడూరు సమీపం పంబలేరు చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

తొలగిన తుఫాన్ ముప్పు

- ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మొంథా తుఫాను ముప్పు పూర్తిగా తొలగిపోయింది. జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. గత ఆదివారం నుంచీ అత్యంత అప్రమత్తంగా ఉంటూ రాత్రింబవళ్లు విధులు నిర్వర్తించిన యంత్రాంగానికి టెన్షన్ తప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా బలపడిన సమయంలో వాతావరణ పరిశోధనా కేంద్రం జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈనెల 27, 28, 29 తేదీల్లో జిల్లాలో భారీ నుంచీ అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. జిల్లాలో ఐదు మండలాలు సముద్ర తీరాన ఉండటం, మరిన్ని మండలాలు తీరానికి చేరువగా ఉండటంతో అధికార యంత్రాంగం ఆందోళనకు గురైంది. జిల్లాలో వెలిగొండ, శేషాచల కొండలున్న కారణంగా భారీ వర్షాలకు కైవల్య, స్వర్ణముఖి నదులు, పలు వాగులూ ఉధృతంగా ప్రవహిస్తాయి. అలాగే దక్షిణాన కాళంగి, అరుణా నదులు, ఇతర వాగులు సైతం జోరుగా పారుతాయి. దీంతో జిల్లాలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు సునాయాసంగా నిండిపోతాయి. ఇక, వర్షాల తీవ్రత పెరిగితే లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, చెరువులకు గండ్లు పడడం, పంటలు నీట మునగడం, రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు కొట్టుకుపోవడం వంటి అనర్థాలు జరుగుతున్నాయి. ఈ అనుభవాల నేపథ్యంలో మొంథా తుఫానుతో జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించడం యంత్రాంగాన్ని కలవరపరిచింది. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారిగా పంపడంతో పాటు తక్షణ సహాయక చర్యలకు నిధులు కూడా కేటాయించింది. ఎస్డీఆర్ఎఫ్ బృందాలను కూడా పంపింది. మరోవైపు మండల స్థాయిల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయించిన కలెక్టర్ మూడు రోజుల పాటు సచివాలయాల స్థాయిలో రాత్రింబవళ్ళు ఉద్యోగులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్, ఎస్పీ, ప్రత్యేకాధికారులతో పాటు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని పరిశీలిస్తూ వచ్చారు. అయితే మంగళవారం సాయంత్రానికే తుఫాను ముప్పు తగ్గిందని ప్రభుత్వం జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. తుఫాను ముప్పు తగ్గినా ప్రత్యేకించి తీరానికి చేరువగా వున్న 11 మండలాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. చివరికి బుధవారం ఆ ముప్పును కూడా జిల్లా తప్పించుకుంది. మూడు రోజుల పాటు ఇల్లూ వాకిలీ వదిలిపెట్టి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించిన జిల్లా అధికార యంత్రాంగం, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. వెయ్యి హెక్టార్ల వరకూ పంటలు నీట మునగడంతో పాటు 16 ఇళ్ళు కూలిపోవడం, కొన్ని చెరువులకు గండ్లు పడడం, రోడ్లు దెబ్బతినడం మినహా ఎక్కడా ప్రాణ నష్టం జరగకపోవడం అధికార యంత్రాంగానికి ఊరట కలిగించింది. తొలుత భయపడ్డ స్థాయిలో నష్టాలు సంభవించకపోవడంతో అధికారులతో పాటు ప్రజలకు సైతం ఉపశమనాన్నిచ్చింది. బుధవారం ఉదయం నుంచి ఎండ రావడంతో.. జనజీవనం సాధారణ స్థితికి వచ్చింది. జిల్లాలో కొన్ని వాగులు బుధవారమూ ఉధ్రుతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు పరిశీలించారు.

'విధులకు డుమ్మా'పై ఆందోళన

తడ, ఆంధ్రజ్యోతి: తుఫాన్ సమయంలో కొందరు అధికారులు, ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టడంపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం వెలువడటంతో అధికారవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎవరిపై చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే తడ మండలంలో ఓ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసిచ్చారు.

'మొంథా' నష్టాన్ని లెక్కించండి

- పునరావాస కేంద్రాలకు నిత్యావసరాలు అందించాలన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల జిల్లాలో జరిగిన నష్టాన్ని లెక్కించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. తుఫాన్ నష్టపరిహార గణన చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. బురద, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ చేయాలని తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. చెరువులు, కాజ్‌వేలు వద్ద వరద ప్రవాహం తగ్గే వరకు పర్యవేక్షిస్తుండాలన్నారు. గుంతలు ఏర్పడిన చోట రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు నిత్యావసర సరుకులు, ప్రతి కుటుంబానికీ రూ.3వేలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరో నాలుగు రోజులు బీచ్‌లు, చెరువుల వద్దకు ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి మాజీ డీసీపై సస్పెన్షన్ ఎత్తివేత

- దూరంగా, నాన్ ఫోకల్ పోస్టులో నియమించాలని ప్రభుత్వ ఆదేశం
- ఓటరు కార్డుల వ్యవహారంలో కొనసాగనున్న విచారణ

తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ కమిషనర్ పి.చంద్రమౌళీశ్వరరెడ్డిపై సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. అయితే శాఖాపరమైన విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. విచారణను ప్రభావితం చేసే వీలు లేకుండా తిరుపతికి దూరంగా బదిలీ చేయాలని, నాన్ ఫోకల్ పోస్టులో నియమించాలని ఆదేశించింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు గత వైసీపీ ప్రభుత్వంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి 2021 నాటి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. అప్పట్లో ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు తనకు తానే ఈఆర్వోగా వ్యవహరించారనేది ప్రధాన ఫిర్యాదు. ఆ హోదాలో ఎలాంటి క్లైమ్ ఫారాలూ లేకుండానే ఓటరు ఐడీ కార్డులను వేల సంఖ్యలో డౌన్‌లోడ్ చేశారనేది మరో ఆరోపణ. వీటిని తీవ్రంగా పరిగణించిన ఎన్నికల కమిషన్ విచారణకు ఆదేశించింది. దీంతో పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వాటి దర్యాప్తునకు సిట్ కూడా ఏర్పాటైంది. ప్రాథమిక విచారణలో చంద్రమౌళీశ్వరరెడ్డి ఈసీ నోటిఫికేషన్ జారీ చేయకుండానే తనకు తానుగా తిరుపతి సెగ్మెంట్‌కు ఈఆర్వోగా ఎన్నికల్లో విధులు నిర్వర్తించినట్టు తేలింది. దీన్ని పరిగణనలోకి తీసుకుని ఈసీ ఆదేశించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరి 9న చంద్రమౌళీశ్వరరెడ్డిని సస్పెండ్ చేసింది. సస్పెన్షన్ ఎత్తివేసే విషయమై గతేడాది సెప్టెంబరు 27న, ఈ ఏడాది ఏప్రిల్ 25న రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల కమిటీ సమీక్షించినప్పటికీ ఆయనపై వచ్చిన ఆరోపణల తీవ్రత దృష్ట్యా కొనసాగించాలని నిర్ణయించింది. ఏడాది దాటినా తనపై సస్పెన్షన్ ఎత్తివేయలేదని, తనను తిరిగి సర్వీసులోకి తీసుకోలేదని చంద్రమౌళీశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన రిట్ పిటిషన్ (నంబరు 16450-2025)పై హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఆ క్రమంలో ఆగస్టు 21న ఉన్నతాధికారుల కమిటీ మరోసారి సమావేశమై చంద్రమౌళీశ్వరరెడ్డి సస్పెన్షన్‌పై సమీక్షించింది. విచారణ కొనసాగిస్తూనే ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నిర్ణయించింది. ఆయనను తిరిగి సర్వీసులోకి తీసుకోవాలని కూడా నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీ సిఫారసులను ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌కు నివేదించగా ఈసీ కూడా అంగీకరించింది. దీంతో చంద్రమౌళీశ్వర్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విచారణను ప్రభావితం చేయకుండా అతడిని తిరుపతి కార్పొరేషన్‌కు సుదూరంగా బదిలీ చేయాలని, నాన్ ఫోకల్ పోస్టులో నియమించాలని ఆదేశించింది. ఈ మేరకు మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.



సీఆర్ నాయుడు
(ఫైల్ ఫొటో)

సీనియర్ జర్నలిస్టు సీఆర్ నాయుడు కన్నుమూత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):సీనియర్ జర్నలిస్టు చెరుకూరి రంగయ్య నాయుడు అలియాస్ సీఆర్ నాయుడు (82) బుధవారం కన్నుమూశారు.వయోభారంతో,అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా హైదరాబాదులో చికిత్స పొందుతున్న ఆయన బీరంగూడలోని కుమార్తె హిమబిందు నివాసంలో తుదిశ్వాస విడిచారు. పాకాల పట్టణం కమతంపల్లెకు చెందిన సీఆర్ నాయుడు ఆంధ్రప్రభ, ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఉదయం, వార్త దినపత్రికల్లో తిరుపతి, బెంగళూరు, చెన్నై కేంద్రాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.గురువారం ఉదయం 10గంటలకు బీరంగూడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.




ఘాట్‌రోడ్డులో బైకుల ఢీ

ఇద్దరికి గాయాలు

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో బుధవారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. తిరుపతికి చెందిన చంద్రమౌళి బైక్‌లో తిరుమలకు వెళ్తుండగా ఆ ప్రాంతంలో పనులు చేసే కార్మికుడు జితేంద్ర బైక్‌పై ఎదురొచ్చాడు. రెండు బైక్‌లూ ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలు అయ్యాయి. భద్రతాసిబ్బంది వారిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అలిపిరి నుంచి వినాయకుడి గుడిదాకా డబుల్ రోడ్డు ఉంటుంది. తిరుమలకు వెళ్లే వైపున కాకుండా మరోవైపున చంద్రమౌళి ప్రయాణిస్తుండగా అదే మార్గంలో ఎదురొచ్చిన బైక్‌ను ఢీకొన్నాడు.

→ ఘటనా ప్రాంతంలో గాయాలతో జితేంద్ర, చంద్రమౌళి

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.57 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 64,250

తలనీలాలు సమర్పించినవారు: 25,250



చినుకుల్లో రోడ్డు ఊడుస్తున్న పారిశుధ్య కార్మికులు

తుఫానే తలవంచింది!

ఎడతెరిపి లేని వాన.. ఈడ్చికొడుతున్న ఈదురుగాలులు, వణికిస్తున్న చలి.. ఇటువంటి వాతావరణంలోనూ తిరుమలలో పారిశుధ్య కార్మికులు తమ విధులు యథాతథంగా నిర్వహిస్తున్నారు. పలుచని పాలిథిన్ రెయిన్‌కోట్‌లు ధరించి పనులు చేస్తూ కనిపిస్తున్నారు. ఆలయపరిసరాలు, కాటేజీలున్న ప్రాంతాల్లోనే కాకుండా, నడక దారులు, వేదపాఠశాల, శ్రీవారి పాదాలు మార్గం, పాపవినాశనం మార్గంలోనూ బుధవారం కార్మికులు పనులు చేస్తూ కనిపించారు. టీటీడీ హెల్త్ విభాగంలో 2,152 మంది పారిశుధ్య కార్మికులున్నారు. మూడు షిఫ్టుల్లో వీరు విధులు నిర్వహిస్తుంటారు. తిరుమల పరిశుభ్రత, అందం వీరి శ్రమ సౌందర్య ఫలితమే! మొంథా తుపాను వానలు వీరి విధినిర్వహణ ముందు తలవంచక తప్పలేదు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



కాలిబాట మార్గాలను శుభ్రపరుస్తున్న కార్మికులు

917 హెక్టార్లలో పంట నష్టం

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో 917 హెక్టార్లలో పంట నష్టం వాటిలినట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభ దశలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపించాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు వరి నాట్లు వేశారన్నారు. విస్తారంగా కురిసిన వర్షాలకు 917 హెక్టార్ల మేర పైరు నీటి మునిగిందన్నారు. పొలాల్లో నీరు బయటకుపోయిన తర్వాత పూర్తి నష్టాన్ని అంచనా వేయగలమన్నారు.

◆ ఎస్వీయూలో ఇంజనీరింగ్, ఫార్మసీలో

ప్రత్యేక ఫీజు సీట్లకు అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రత్యేక ఫీజుతో అడ్మిషన్లకు అనుమతించారు. ఈమేరకు ఎంటెక్, ఎంఫార్మసీ, బీఫార్మసీ కోర్సుల్లో చేరేందుకు అవకాశమేర్పడింది. అర్హత,ఆసక్తి ఉన్న విద్యార్థులు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ కార్యాలయంలో సంప్రదించాలని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ప్రకటనలో తెలిపారు. ఎంటెక్‌లో ప్రవేశానికి గేట్-2025 మొదటి ప్రాధాన్యత, పీసీ ఈసెట్ -2025 రెండవ ప్రాధాన్యత, బీటెక్ వారికి చివరి ప్రాధాన్యతలో అడ్మిషన్లు ఇస్తారు. ఎంఫార్మసీలో చేరడానికి జీ ప్యాట్-2025 వారికి మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్-2025 రాసిన వారికి రెండవ ప్రాధాన్యత, బీఫార్మసీ ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇస్తారన్నారు. బీఫార్మసీలో చేరడానికి ఏ.పి.సెట్-2025 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులకు చివరి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంటెక్ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ. 1,45,170, ఎంఫార్మసీ ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ. 1, 53,940, బీ ఫార్మసీ ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ.81 వేలుగా నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం.. 'ఎస్వీయూనివర్సిటీ.ఎడ్యూ.ఇన్.డీవోఏ' వెబ్‌సైట్‌లో చూడాలని ఆ ప్రకటనలో సూచించారు.

రక్తమోడుతున్న రైలు పట్టాలు

● ఐదేళ్లలో 436 మంది మృత్యువాత ● ప్రమాదాలు కొన్ని.. బలవన్మరణాలు మరికొన్ని



రైలు పట్టాలపై పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్ ఫొటో)

తిరుచానూరు రైల్వే స్టేషన్ నుంచి.. తిరుపతి వెస్ట్ స్టేషన్ వరకు 12 కిలోమీటర్లు. ఈ మధ్యలో.. ఐదేళ్లలో దాదాపు 436 మంది రైలు పట్టాలపై ప్రాణాలు కోల్పోయారు. ఆందోళన కలిగించే గణాంకాలివీ. ఈ మృతుల్లో.. రైళ్ల నుంచి జారిపడిన వారు, పట్టాలు దాటే సమయంలో రైళ్లు ఢీకొనడం, ఆత్మహత్యలు చేసుకున్న వారున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఐదేళ్లలో మృతిచెందింది: 436 మంది

రైలు నుంచి జారిపడిన ఘటనల్లో: 130 మంది

పట్టాలు దాటుతూ రైళ్లు ఢీకొనడంతో చనిపోయింది: 65 మంది

పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకుంది: 210 మంది

గుర్తు తెలియని వారు: మరో 31 మంది

● రెండు రోజుల క్రితం తిరుపతి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నెంబరు 5లో తిరుపతి-కొల్హాపూర్ వెళ్లే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ కదులుతుండగా 45 ఏళ్ల వ్యక్తి రైలు ఎక్కుతున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి రైలుకు, ప్లాట్‌ఫారానికి మధ్యలో పడి శరీరం రెండు ముక్కలై మృతి చెందాడు.

● తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి రేణిగుంట రైల్వే స్టేషన్ మధ్య రిలయన్స్ అండర్ బ్రిడ్జి సమీపంలో 50 సంవత్సరాల వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు.

ఈ రెండూ మచ్చుకు ఉదాహరణలే. తిరుచానూరు.. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ మధ్య తరచూ ఎక్కడో ఒక చోట రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కిక్కిరిసిన ప్రయాణికుల్లో ఉంటున్న జనరల్ బోగీల్లో ఫుట్‌పాత్‌పై ప్రమాదకర పరిస్థితుల్లో కూర్చున్న వారిలో పలువురు ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందుతున్నారు. ఇంకొందరు ప్రయాణికులు పట్టాలు దాటే సమయంలో.. రైలు దగ్గరకు వచ్చే సరికి వెళ్లిపోవచ్చని అనుకుంటారు. ఇలా పలువురు ప్రమాదకర పరిస్థితుల్లో పట్టాలు దాటుతూ మృతి చెందుతున్నారు. పూర్ణకుంభం సమీపంలోని రైల్ ఓవర్ బ్రిడ్జి వద్ద.. అటు పద్మావతి మహిళా వర్సిటీ సమీపంలో.. మరోవైపు స్టేషన్‌లో రైలు షంటింగ్ చేసే సమయంలో ఎక్కువగా చనిపోతున్నారు. ప్రతి నెలా సగటున 5 నుంచి 8 మంది వివిధ కారణాలతో మృత్యువాతపడుతున్నారు. ఇలా ఐదేళ్లలో 436 మంది చనిపోగా.. వీరిలో 31 మంది గుర్తు తెలియని వ్యక్తులే. వీరి వివరాలు తెలియక అనాథ శవాలుగా ఖననం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

రైలు ప్రమాదాల నివారణలో భాగంగా రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు, సంయుక్తంగా రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం. రైలు వచ్చే సమయంలో మైకు ద్వారా అప్రమత్తం చేస్తున్నాం.

- ఆశీర్వాదం, రైల్వే సీఐ

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సందర్భంగా బుధవారం రిజర్వుడ్ గ్రౌండులో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం పోలీసు శాఖ ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, భద్రతా పరమైన సాంకేతిక వ్యవస్థలను వారు ఆసక్తిగా తిలకించారు. అమరవీరుల త్యాగాలకు వారు నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ దేశ భక్తి, సేవాస్ఫూర్తిలను పెంపొందించడం పోటీల ఉద్దేశమని చెప్పారు. అమర వీరుల త్యాగాలను భావి తరాలకు తెలియచేయడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీలత, సీఐ తమీమ్ అహ్మద్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి చేల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు బుచ్చినాయుడు కండ్రిగ మండలం కారణిమిట్టలో నీట మునిగిన వరిచేలను బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. పంటలతో పాటుగా ఎంత మేర నష్టం వాటిల్లిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూరియా పంపిణీ సజావుగా సాగుతోందా అన్ని రైతులను అడిగారు. తమకు ఇస్తున్న యూరియా చాలడం లేదని రైతులు చెప్పారు. తెగిన చెరువులకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు. నారాయణవనం మండలం తుంబూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. బాధితులకు నగదు, సరుకులు అందజేశారు. వెదర్లకండ్రిగలోని పునరావాస కేంద్రాన్నీ పరిశీలించారు.



కారణిమిట్టలో వరిపంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

పూడి రైల్వేలైన్‌కు 6.5 ఎకరాలు గుర్తించాం

● అమ్మవారిపట్టెడలో రైతులతో ఆర్డీవో సమావేశం



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

రేణిగుంట అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి):పూడి రైల్వే లైన్ కోసం భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి సమావేశమయ్యారు. బుధవారం మండల పరిధిలోని అమ్మవారి పట్టెడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పూడి రైల్వే లైన్ నిర్మాణానికి గ్రామంలోని రైతులకు చెందిన 6.5 ఎకరాలను గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించిన 29 రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డీటీ శ్యాం ప్రసాద్, ఆర్ఐ జైకృష్ణ, సర్వేయర్ సురేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.





వసంత మండపంలో మన్ను సేకరిస్తూ.. - విష్వక్సేనుడికి హారతులిస్తున్న అర్చకులు

పుష్పయాగానికి అంకురార్పణ

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం జరగనున్న పుష్పయాగానికి బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. శ్రీవారి ఆలయంలో మూలవిరాట్టుకు ముందు ఆచార్య ఋత్విక్‌వరణం నిర్వహించారు. అర్చకులకు విధుల కేటాయింపునే ఋత్విక్‌వరణం అంటారు. ఇందులో వైదిక కార్యక్రమాల నిర్వహణకోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. సాక్షాత్తు శ్రీవారి ఆజ్ఞ మేరకు విధులు పొందినట్టు అర్చకులు భావిస్తారు. ఇక, రాత్రి 7 గంటలకు శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడిని ఆలయం నుంచి వసంతమండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించి తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. 8 నుంచి 9 గంటల నడుమ ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ జరిగింది.

నేడు పుష్పయాగం: శ్రీవారి ఆలయంలో గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులకు కల్యాణమండపంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు రకాల పత్రాలు, 12 రకాల పుష్పాలతో (సుమారు 9 టన్నులు) ఉత్సవర్లకు పుష్పయాగం నిర్వహిస్తారు.

రైతుల పరిస్థితి దయనీయం

● ముక్కంటి ఆలయంలో అవినీతి
● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దేశంలో పరిశ్రమలకు కల్పిస్తున్న సదుపాయాలను రైతులకు ఇవ్వడం లేదని దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 11 ఏళ్లలో ఎన్డీయే ప్రభుత్వం రైతులకు చేసింది శూన్యమన్నారు. యూపీయే హయాంలో రూ.70వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామన్నారు. అదానీకి భూములు, విమానాశ్రయాలు ఇస్తారు కానీ రైతులకు ఏం ఇచ్చారని ప్రశ్నించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.22వేల కోట్లు రాయితీ ఇచ్చారని, రైతు బిడ్డ అని చెప్పుకునే సీఎం చంద్రబాబు ఏం చేశారన్నారు. యూపీఏ హయాంలో శ్రీసిటీ, మేనకూరు సెజ్, కృష్ణపట్నం పోర్టు తెచ్చామన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు రూ.14.50 లక్షల కోట్ల రుణమాఫీ చేశాయని, ఎవరికి ఎంత మాఫీ చేశారో ప్రధాని మోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్, సీఎం చంద్రబాబు చెప్పాలన్నారు. తమ హయాంలో మన్నవరంలో భెల్ పరిశ్రమకు పునాదిరాయి వేయగా నేడు అనాది రాయిగా మిగిలిందన్నారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయంలో చెప్పులు, సెల్‌ఫోన్ స్టాండ్, కారు పార్కింగ్‌లో అవినీతి చోటు చేసుకుందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 20 వేల ఎకరాల భూములను స్వాహా చేశారని సీఎం, కలెక్టర్ జోక్యం చేసుకుని ఆక్రమణలపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తెయ్యనాయుడు, నరేంద్రనాయుడు, సమీవుల్లా, రవి, జనార్దన రెడ్డి, శివయ్య, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ విధుల్లో అలసత్వం..

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

తడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ విధుల్లో అలసత్వం వహించిన మరో పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ అయ్యింది. సోమవారం రాత్రి కారూరు సచివాలయ పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు తుఫాన్ విధులు నిర్వహించడంలో అలసత్వం వహించారని అధికారుల పరిశీలనలో తేలింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ తహసీల్దారు శరత్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. కాగా, ఇప్పటికే పెరియవట్టు, పూడి, అండగుండాల, సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

యాచవరం సొసైటీ అధ్యక్షుడిపై అట్రాసిటీ కేసు

బాలాయపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): యాచవరం సొసైటీ అధ్యక్షుడు సీసీ నాయుడిపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలు... మండలంలోని అక్కసబముద్రం గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 178లో 4.60 ఎకరాలను యాచవరం ఎస్సీ కాలనీకి చెందిన వరికూటి అన్నపూర్ణ ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్నారు. ఆ భూమిని ఆక్రమించుకునేందుకు వెంగమాంబపురం గ్రామానికి చెందిన యాచవరం సొసైటీ అధ్యక్షుడు సీసీ నాయుడు ఎక్స్‌కవేటర్, డోజర్లతో చదును చేస్తుండగా అన్నపూర్ణ తన మరిది జయరామయ్యతో కలిసి అడ్డుకున్నారు. ఈ క్రమంలో సీసీ నాయుడు దాడి చేసి కులంపేరుతో దూషించాడని అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డీ-ఎడిక్షన్ కేంద్ర విస్తరణ యోచన

● పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవికృష్ణ

తిరుపతి(వైద్యం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని మత్తు వ్యసన నిర్మూలన కేంద్రాన్ని(డీ-ఎడిక్షన్ కేంద్రం) 60 పడకలతో విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోందని పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఏ.రవికృష్ణ చెప్పారు. ఈ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ తిరుపతితోపాటు విశాఖపట్నం, కర్నూలు జిల్లాల్లోని కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిస్తున్నామన్నారు. మత్తు వ్యసనాల నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రలను బాధితులు వినియోగించుకోవాలన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురితో ఆయన మాట్లాడారు. సదుపాయాల గురించి ఆరా తీశారు. చికిత్సా విధానాలను పరిశీలించారు. రాష్ట్రంలో గంజాయి విక్రయాలను చాలా వరకు అరికట్టామని ఐజీ చెప్పారు. విద్యార్థులకు,యువతకు అవగాహన కల్పించి గంజాయి జోలికి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇక్కడి కేంద్రంలో అందిస్తున్న చికిత్సలు, కౌన్సెలింగ్ పద్ధతుల గురించి ఎస్పీ సుబ్బరాయుడు ఆయనకు వివరించారు. ఆస్పత్రి సూపరిటెండెంట్ రాధ, ఏఎస్పీ రవిమనోహరాచారి, ఏఆర్ఎంవో హరికృష్ణ, డిఐవో హరిప్రసాద్, మానసిక విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం విభాగాధిపతి డాక్టర్ పద్మావతి, మెడికల్ ఆఫీసర్ మానస, కౌన్సలర్లు మురళీ, ఈగల్ టీం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోగుల వివరాలు పరిశీలిస్తున్న ఐజీ రవికృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో సూపర్‌లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు మంగళం డిపో మేనేజర్ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం, పంచరామారాలు, మొగిలి, శ్రీకాళహస్తి, తిరువణ్ణామలై, కోటిలింగాలు, గుడిమల్లం, ముక్కోటి ఆలయాల సందర్శనకు బస్సులు కేటాయించామని పేర్కొన్నారు. వివరాలను గురువారం ఆన్‌లైన్‌లో ఉంచుతామని, భక్తులు ముందస్తుగానే టిక్కెట్ పొందవచ్చని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7893723453, 8247687578లను సంప్రదించాలని కోరారు.

పద్మావతి వర్సిటీలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో నాలుగు రోజుల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ చేపట్టింది. విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడం, ప్లేస్‌మెంట్ అవకాశాలకు సిద్ధం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇన్ఫోసిస్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ పూర్తి అయిన తర్వాత క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కూడా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని ప్రారంభించగా, సైన్స్ డీన్ సుధా నిర్వహించారు.

తుపానుతో ఛిద్రమైన రోడ్లు


బత్తలాపురం వద్ద గోతులమయంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఓజిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అసలే అంతంతమాత్రంగా ఉన్న రహదారులు... మొంథా తుపాను ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు ఛిద్రమయ్యాయి. ఓజిలి - కురుగొండ, ఓజిలి సమపంలోని సబ్‌స్టేషను నుంచి వెంకటరెడ్డిపాళెం మీదుగా మానమాల రోడ్డు, ఓజిలి - గొల్లపల్లి రోడ్డు(ఇనుగుంట వరకు), పున్నేపల్లి నుంచి నగుటూరు, రజానగరం నుంచి నాయుడుపేట మండలం కోనేటిరాజుపాళెం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు గోతులమయంగా మారాయి. ముఖ్యంగా బత్తలాపురం, మాచవరం, ముమ్మాయపాళెం, వీర్లగునుపాడు, గుర్రంకొండ తదితర ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న పంబలేరు వాగు


పురిటిపాళెం సమీపంలోని పంబలేరువాగు ప్రవాహం

గూడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో పట్టణంలోని పంబలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పై ప్రాంతాల్లో పడిన వర్షంతో పాటు కైవల్యానదిలో వరద, కండలేరు జలాశయం నుంచి విడుదల చేసే నీరు పలు కాలువలు, వాగుల ద్వారా ప్రవహించి గూడూరులోని పంబలేరువాగులో కలుస్తుంది. అక్కడ నుంచి చిల్లకూరు మండలంలోని సముద్రతీరంలో కలిసిపోతుంది. పంబలేరువాగులో ఉధృతంగా సాగుతుండడంతో చప్టాపై బుధవారం వరదనీరు ప్రవహించింది.

మహిళలు నాయకత్వ పాత్ర పోషించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

గూడూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలు నాయకత్వ పాత్ర పోషించాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ప్రతినిధి హరికృష్ణ అన్నారు. బుధవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో సీబీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛోత్సవ్-2025 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల భద్రత, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే స్వచ్ఛతాహి సేవా లక్ష్యం అని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యసాధనలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, సీడీపీవో మెహబూబి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు భోజనం అందజేత


భోజనం అందజేస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు, గుండాల లీలావతి

చిల్లకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నిర్వాసితులైన బాధిత కుటుంబాలకు బుధవారం తహసీల్దారు శ్రీనివాసులు, ఏపీ లైవ్‌స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి సహకారంతో భోజనం అందజేశారు. లీలావతి మాట్లాడుతూ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి సూచనల మేరకు తుఫాన్ బాధిత కుటుబాలకు భోజనం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి జమీర్‌బాషా, ఆర్ఐ పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు, ఏఎంసీ డైరెక్టర్ నెలటూరు సుప్రజ

చిల్లకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు బుధవారం తహసీల్దారు శ్రీనివాసులు, గూడూరు ఏఎంసీ డైరెక్టర్ నెలటూరు సుప్రజ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నెలటూరు చిరంజీవి ఆధ్వర్యంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఏఎంసీ డైరెక్టర్ సుప్రజ మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా గ్రామంలోని 30 గిరిజన కుటుంబాలు ఇబ్బందులు పడుతుండడంతో వారికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి సూచనల మేరకు నిత్యావసరాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కందల శ్రీనివాసులు, వీఆర్‌వో శ్రీనివాసులు, సుభాషిణి, మధుజ్యోతి, సుజిత్, చెంగల్ రాయుడు, సుధాకర్, రమణయ్య రవి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీటీడీలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్, వి.రాజ్‌కుమార్, పి.శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో భజన మందిరాలు నిర్మించాలని కోరారు. టీటీడీ షాపింగ్ కాంప్లెక్స్‌ల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

సూళ్లూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఎంకేఎం కల్యాణ మండపం సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సును వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ రోడ్డులో ఒరిగిపోయిన లారీ



సూళ్లూరుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డులో షార్ బస్సుల గ్యారేజ్ వద్ద సిమెంట్ లోడుతో వెళ్తున్న ఓ లారీ రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనులకు వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీని రోడ్డు పక్కన ఆపేందుకు డ్రైవర్ దారి అంచుకు వెళ్లగానే వర్షాలకు సైడ్ బర్మర్ తడిగా ఉండడంతో టైర్లు కుంగిపోయి పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

చింతపూడిలో సంతకాల సేకరణ

పెళ్లకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని చింతపూడి గ్రామంలో బుధవారం వైసీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వైసీపీ మండల కన్వీనర్ ఓబ్బు వెంకటరత్నం, నాయకులు సాగి జితేంద్ర, బండి బాలు, అట్ల గోపాల్, మోహన్, కృష్ణ, సురేష్, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

యడపూడి దారిని బాగు చేయండి


మడుగుల్లా గుంతలు

పెళ్లకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు సౌకర్యం సక్రమంగా లేక కలవకూరు పంచాయతీ పరిధిలోని యడపూడి గ్రామస్తులు నకరయాతన పడుతున్నారు. యడపూడి నుంచి అనకవోలు బీటీ రోడ్డు వరకు ఉన్న సుమారు 3 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్డు అడుగడునా గుంతలమయమై దుస్థితికి చేరుకుంది. రైతులు, విద్యార్థులతో పాటు మేనకూరు సెజ్‌కు వెళ్లే కార్మికుల రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి దారిని బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ రవిచంద్రను కలిసిన నెలవల


బీద రవిచంద్రను సత్కరిస్తున్న మాజీ ఎంపీ నెలవల తదితరులు

పెళ్లకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్రను సూళ్లూరుపేట ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం బుధవారం నెల్లూరులో కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు విడుదల చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, నాయకులు మదన్‌మోహన్ నాయుడు, చిల్లకూరు సొసైటీ డైరెక్టర్ పెళ్లకూరు గోపాల్‌కృష్ణ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోండి


మోటార్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ

కోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడుతున్నందున అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అధికారులు నీటి సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ కోరారు. మండల పరిధిలోని చంద్రశేఖరపురం, గూడలిలోని దక్షిణపొలం, నెల్లూరుపల్లి కొత్తపాళెం, తదితర గ్రామాల్లో మంచినీటి పథకాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఖచ్చితంగా క్లోరినేషన్ చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం చేయ రాదన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అరవింద్ ఉన్నారు.

ఆకతాయిల దాడిలో ముగ్గురికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆకతాయిలు దాడి చేయడంతో ఇద్దరు వృద్ధులు, మరో యువకుడు గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు... కమతం సుధారాణి సంజయ్ గాంధీ కాలనీలో కాపురముంటున్నారు. ఆమె తండ్రి కృష్ణమూర్తి నడుచుకుంటూ అలిపిరి రోడ్డు వైపు వెళుతున్నారు. వైకుంఠపురానికి చెందిన సాహిత్ ద్విచక్ర వాహనంపై వేగంగా అలిపిరి వైపు వెళుతున్నాడు. అదే సమయంలో రోడ్డు దాటుతున్న కృష్ణమూర్తిని ఢీకొట్టాడు. కృష్ణమూర్తి కిందపడి గాయాలపాలయ్యాడు. ఇదేమిటని ప్రశ్నించినందుకు మళ్లీ దాడి చేశాడు. పక్కనే ఉన్న కృష్ణమూర్తి బంధువులు హరిబాబు, రవి 'బండితో కొట్టి గాయపరించింది కాక.. అడిగినందుకు కొడతావా' అని నిలదీశారు. దీంతో మరింత రెచ్చిపోయిన సాహిత్ వారిపైనా దాడి చేశాడు. సుధారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు సాహిత్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.



గుర్రపుడెక్కతో నిండిపోయిన దూడలకాలువ - చల్లకాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్క

వరద పారే దారేదీ?

- కాలువల నిండా గుర్రపుడెక్క
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- నివాస గృహాల్లోకి వర్షపునీరు

గూడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ల సమయంలో వరదనీరు గూడూరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా సజావుగా ముందుకు సాగేలా పలు కాలువలు ఉన్నాయి. ఇందులో పంబలేరువాగు, చల్లకాలువ, దూడల కాలువ ప్రధానమైనవి. వీటిల్లో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంగా మారింది. మొంథా తుపాను ప్రభావంతో 24 గంటల పాటు ఎడతెరపిలేకుండా మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షం లేకపోవడంతో కాలువల్లో నీటి ప్రవాహం సైతం తక్కువగా ఉంది. గూడూరు పరిసర ప్రాంతాల్లో పడిన వర్షపునీటితో వెంకటగిరి కైవల్యానది పొంగితే వచ్చే వరద, కండలేరు జలాశయం నుంచి విడుదల చేస్తే వచ్చే నీరంతా పట్టణంలోని పంబలేరు, చల్లకాలువ, దూడల కాలువల ద్వారా ప్రవహించి పురిటిపాళెం సమీపంలోని పంబలేరు వాగులోకి చేరుకుని చిల్లకూరు మండలం తిప్ప గుంటపాళెం సమీపంలోని ఉప్పుటేరులో కలసి, అక్కడ నుంచి గుమ్మళ్లదిబ్బ సముద్రంలోకి చేరుతుంది. అయితే చల్లకాలువ, దూడలకాలువలలో గుర్రపుడెక్క పేరుకుపోయి వరదనీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. చల్లకాలువను ఆనుకుని జనార్దనరెడ్డికాలనీ, సాధుపేట, దూర్జటినగర్, దూడల కాలువను ఆనుకుని విఘ్నేశ్వరపురం, ఆర్టీసీ బస్టాండు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ కాలువల్లో గుర్రపుడెక్కను తొలగించకపోతే వరద ఉధృతి పెరిగితే కట్టలు దెబ్బతిని నివాసగృహాల్లోకి నీరు చేరుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధింత అధికారులు స్పందించి చల్లకాలువ, దూడలకాలువలో గుర్రపుడెక్క తొలగించి, నీటి ప్రవాహం సజావులా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తొలగిన తుఫాన్ ముప్పు

యథావిధిగా జనజీవనం

తడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ప్రజలను భయాందోళనకు గురిచేసిన మొంథా తుఫాన్ ముప్పు తొలగింది. నాలుగు రోజులుగా వర్షాలతో ఇబ్బందులు పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి మొంథా తుఫాను తీరం దాటడంతో వర్షం ఆగిపోయింది. బుధవారం ఉదయం ఎండ కాయడంతో జనజీవనం సాధారణ స్థితికి వచ్చింది. కాగా, చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో మత్స్యకార కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీకి మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. తుఫాన్ కారణంగా రామాపురంలో మూడు పూరిగుడిసెలు, పెరియవట్టులో ఒక పూరిగుడిసె పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెండు రోజులుగా ఇరకం, బీవీపాళెం మధ్య నిలిచిపోయిన పడవ ప్రయాణాలు బుధవారం యథావిధిగా సాగాయి.

నేడు రక్తదాన శిబిరం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఉదయం 8.30 గంటలకు డీఎస్పీ చెంచుబాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారని సీఐ తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

తడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని అనపగుంట దళితవాడలో సుమారు 100 మందికి దుప్పట్లు, పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మాబాషా, హరిబాబు, కోటి యాదవ్, ఆవుల దాస్, శంకు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పరిశీలన


బాలిరెడ్డిపాళెం - గంగన్నపాళెం మధ్య ఉన్న వంతెనను పరిశీలిస్తున్న ఎంపీడీవో సాయిప్రసాద్, సిబ్బంది

వాకాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలిరెడ్డిపాళెం - గంగన్నపాళెం వంతెనను ఎంపీడీవో సాయిప్రసాద్ బుధవారం పరిశీలించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో స్వర్ణముఖినదిలోకి భారీగా వరద వస్తోంది. వంతెన మరమ్మతులకు గురికావడంతో రాకపోకలను నిలిపివేశారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

గూడూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీ లేవుట్‌లోని అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి పలు రకాల అభిషేకాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామివారి పడిపూజ నిర్వహించి భజనలు చేస్తూ పాటలు పడారు. అనంతరం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

తుఫాన్ బాధితులకు ఆశ్రయం

డక్కిలి, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఇబ్బందులకు గురైన 181 మందికి ఆరు కేంద్రాల్లో ఆశ్రయం కల్పించినట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. చాపలపల్లి, దగ్గవోలు, సూరాయపాళెం, నాగులపాడు, పలుగోడు, మాటుమడుగు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి వీఆర్‌వోలను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తహసీల్దారు తెలిపారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన


దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి, అక్టోబర్ 29: మొంథా తుఫాన్ కారణంగా పట్టణంలో వరద తాకిడి గురైన లోతట్టు ప్రాంతాలను బుధవారం టీడీపీ నాయకులు పరిశీలించారు. ప్రజలను పరిస్థితులను తెలుసుకున్నారు. బాధితులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం మండల పరిధిలో వరద తాకిడికి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, నాయకుల పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, గొల్లగుంట వెంకటముని, బాబు నాయుడు, కూని రవి తదితరులు పాల్గొన్నారు.

పేటశ్రీకి సాహితీ పురస్కారం ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాన్ని పేట శ్రీనివాసులు రెడ్డి అందుకున్నారు. ఆయన రాసిన తిరుపతి కథలు పుస్తకానికి తెలుగు విశ్వవిద్యాలయం ఈ సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది. హైదరాబాద్ ఎన్టీఆర్ కళామందిర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో పేట శ్రీనివాసులు రెడ్డి పురస్కారాన్ని అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


మృతి చెందిన పుల్లయ్య

సూళ్లూరుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శేషసాయి కల్యాణ మండం ఎదురుగా జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంపలకండ్రిగకు చెందిన పల్లికొండ పుల్లయ్య(59) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... గంపలకండ్రిగకు చెందిన పుల్లయ్య సూళ్లూరుపేటకు వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ షాపు వద్ద మోటారు సైకిల్ ఆపారు. ఎదురుగా ఉన్న హోటల్‌లోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఓ మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో చెయ్యి, కాలు తిరిగి, తలకు బలమైన గాయాలవడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడ్ని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే విజయశ్రీ

రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో అదే దారిలో ఇంటికి వెళ్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తన వాహనం ఆపి గాయాలపాలై రక్తపు మడుగులో ఉన్న పుల్లయ్యను ఆస్పత్రికి పంపించే ఏర్పాట్లు చేశారు. వైద్యులకు ఫోన్ చేసి క్షతగాత్రుడికి చికిత్స అందించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ ఉన్నారు.

మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వర రావు

చిట్టమూరు, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు స్త్రీ సంక్షేమ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. అధికారులు వారివారి శాఖల్లో అభివృద్ధి పనులు, పురోగతిని వివరించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రజా సమస్యలను ప్రస్తావించారు. వైస్ ఎంపీపీలు బీవీ రమణయ్య, రాయిపు సుబ్బమ్మ, వాకాడు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ప్రమీళ, మండల ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, ఏవో నిరంజన్ కుమార్, ఎంపీటీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో మస్తానయ్య

కోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈవో మస్తానయ్య అన్నారు. కోట పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు వండిపెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు.

దళిత ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయండి

గూడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ నవంబరు 1వ తేదీన హైదరాబాదులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు సిసింద్రి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో దేవదాస్, విజయలక్ష్మి, మల్లికార్జున, సాయినాథ్, కిరణ్, పెంచలయ్య, గురవయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కాలభైరవ హోమం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కపిలేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కాలభైరవస్వామి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆలయ అవరణలోని ఆంజనేయస్వామి సన్నిధికి సమీపంలో ఏర్పాటు చేసిన వేదికలో హోమ పూజలు జరిగాయి. తొలుత కాలభైరవస్వామి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. కలశ స్థాపన చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. కాలభైరవుడికి విశేష పూజల అనంతరం కర్పూర హారతులిచ్చారు. కాలభైరవ హోమ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించి, పూర్ణాహుతి సమర్పించారు. గురువారం నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు కామాక్షి అమ్మవారికి చండీ హోమ పూజలు నిర్వహించనున్నారు.


కాలభైరవ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు